ఆదివారం
ప్రజాశక్తి
మే 16, 2004

అలగానిపాడు ముద్దుబిడ్డ అమరజీవి సుందరయ్య

హ్యాపీ బర్త్‌డే

(16-5-2004 నుండి 22-5-2004 వరకు)



సమరసింహారెడ్డి
2సం॥, 16.5.2002
నీలిమ-భీమార్జున్‌రెడ్డి
నల్లగొండ

దీక్షిత
4సం॥, 17.5.2000
మంజుభార్గవి-సతీష్
తిరుపతి

నిఖిల్
మే-17
శోభారాణి-సిద్ధు
దిల్‌సుఖ్‌నగర్-హైదరాబాద్

వెంకటసాయి ప్రదీప్
2సం॥, 17.5.2002
సత్యవేణి-సత్యారావు
పెద్దాపురం-తూ॥గో॥

శ్రీజ(మిని)
1సం॥, 18.35.2003
వరలక్ష్మి-మహేందర్
కాచిగూడ-హైదరాబాద్

హర్షిత్‌రెడ్డి
2సం॥, 18.5.2002
హరిత-శ్రీయుతరెడ్డి
నెమ్మని-నల్లగొండ

వై.మౌనిక
మే-18
దుర్గ-మాధవరావు
బత్తులవారిగూడెం-కృష్ణా

అజేయ్‌కుమార్
2సం॥, 18.5.2002
పద్మ-నాగరాజు
అమరచింత-మహబూబ్‌నగర్

జాషువా డానియేలు
3సం॥, 20.5.2001
మేరి-శ్రీను
క్రోసూరు-గుంటూరు

బి.నాని
మే-22
శ్రీలక్ష్మి-బాలాజీప్రసాద్
రాజేంద్రనగర్-నెల్లూరు

నిఖిల్‌బాబు
గ్రేస్‌మణి-రాజశేఖర్
సూళ్ళూరుపేట-నెల్లూరు

శివరంజని
ఉమాదేవి-వెంకటేష్
లాలుకోట-మ॥నగర్

మనోజ్‌కుమార్
సరిత-లెనిన్
పజ్జూరు-నల్లగొండ

రుచిత
1సం॥, మే-2003
పద్మావతి-చంద్రశేఖర్
కోటపహాడ్-నల్లగొండ

సృజన
4సం॥, మే-2000
కవిత-సత్యనారాయణరెడ్డి
శివరాంపల్లి-రంగారెడ్డి

మురళి
సునీత-వెంకన్న
మహబూబాబాద్-వరంగల్

వెంకటత్రివేణి
3సం॥, మే-2001
ఉష-పోతురాజు
ప్రత్తిపాడు-గుంటూరు

ప్రవళిక
3సం॥, మే-2001
అరుంధతి-రవి
రాజంపేట-సంగారెడ్డి

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



మేడే వర్ధిల్లుతుంది

మే 1వ తేదీన మేడే ప్రత్యేకసంచికగా వెలువడిన ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్‌స్టోరీ మేడే వర్ధిల్లాలి అర్థవంతంగా ఉంది. ప్రపంచీకరణ, ప్రపంచబ్యాంక్ విధానాల ఫలితంగా జరుగుతున్న అనర్థాల గురించి రచయిత చాలా స్పష్టంగా వివరించారు. ఈ విధానాల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, ఉద్యమాలు తెలుసుకోగలిగాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజలకు ఎంత హాని చేస్తున్నాయో తెలిసింది. ప్రజాశక్తి ఆదివారం సంచిక విజ్ఞానదాయకంగా అందిస్తున్నందుకు అభినందనలు.

– కె.వెంకటేశ్వరరావు,లబ్బీపేట, విజయవాడ.
– యు.కోటేశ్వరరావు, చిట్టినగర్, విజయవాడ.
– ఎస్. మల్లేష్, హైదరాబాద్.
– ఎస్. వెంకారెడ్డి, నెల్లూరు.

కథ బాగుంది

పల్లెల్లో జరుగుతున్న భాగోతాలు, పెత్తందార్లు ఆడుతున్న ఆటలు, సామాన్యులను మోసం చేస్తూ వారిని అణగదొక్కుతున్న తీరుపై రాసిన దొంగ జంపడు కథ చాలా బాగుంది. తెలంగాణా పల్లెల్లో అన్నిచోట్లా ఇటువంటి దొంగ జంపడు లాంటి మనుషులను పెత్తందార్లు పోషిస్తుంటారు. కథ చెప్పిన తీరు మరింత ఆకర్షణీయంగా ఉంటే తేలిగ్గా అర్థమయ్యేది. ఆదివారం అనుబంధం మేడే ప్రత్యేక సంచిక వెరైటీగా ఉంది.

– పి. రామిరెడ్డి, హనుమకొండ.
– బి. బలరాం, ఖమ్మం.
– తప్పెట్ల రాజు, రాజోలు, మహబూబాబాద్, వరంగల్ జిల్లా

కలం స్నేహం కొనసాగించాలి

మేడే ప్రత్యేకసంచిక ఆదివారం అనుబంధంలో చివరి అట్టపై ప్రచురించిన కలం స్నేహం రంగుల శీర్షిక చాలా ఆకర్షణీయంగా ఉంది. బాలల కోసం పెట్టిన ఈ రంగుల శీర్షిక ప్రతి వారం ఇవ్వాలని కోరుతున్నాము. ఈ శీర్షిక వల్ల బాలల్లో కలం స్నేహం పట్ల ఆసక్తి పెరుగుతుంది. తద్వారా వారిలో స్నేహభావం పెంపొందుతుంది.

– కె. చంద్రశేఖర్, విజయనగరం
– పి. కిరణ్‌కుమార్, గుడివాడ, కృష్ణాజిల్లా

ఆలోచింపచేస్తున్నాయి

ఆదివారం అనుబంధంలో ప్రచురిస్తున్న కార్టూన్లు, మనలో మాట, ఔరా!, న్యాయసలహాలు ఆలోచింప చేస్తున్నాయి. మేడే సంచికలో వచ్చిన చంద్రబాబు, వాజ్‌పేయి కార్టూన్లు కడుపుబ్బ నవ్వించడమే గాకుండా ఆలోచింప చేశాయి. ఇంతమంచి కార్టూన్లు, ఔరా, న్యాయసలహాలు అందజేస్తున్న మీకు అభినందనలు.

– కె.ప్రభాకర్, చిమిర్యాల, నల్గొండ.

'న్యాయదీపం' న్యాయానికి మారుపేరు



1 మే 2004 ఆదివారం ప్రజాశక్తి అనుంధంలో రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన 'న్యాయదీపం' న్యాయానికి మారుపేరుగా, న్యాయమే తన ఊపిరిగా చేసుకొని తనకంటి చూపు కోల్పోయిన న్యాయదేవత కళ్ళు తెరిపించి న్యాయాన్ని బతికించి, నిజమైన న్యాయదేవతగా సుప్రియ న్యాయస్థానానికే గర్వకారణం.

– మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

అతడు సామాన్యుడు!

అతడు సామాన్యుడు!

అతడు సగటు మనిషి!

అతడు గుమాస్తా. అతడు బక్కరైతు. అతడు రైతుకూలీ. అతడు కార్మికుడు! అతడు శబ్దం. అతడు నిశ్శబ్దం. అతడు నిశ్శబ్ద శబ్దం!

అతడు సాత్వికుడు. అతడు స్వాప్నికుడు. అతడు సాహసి!

అతడు మెతకమనిషి. అతడు మెత్తని మనిషి. అతడు నిప్పురవ్వ. అతడు నివురుగప్పిన నిప్పు!

అతడు నవ్వుతాడు. అతడు ఏడుస్తాడు. అతడు నవ్వుతూ ఏడుస్తాడు. అతడు ఏడుస్తూ నవ్వుతాడు!

అతడు చార్లీచాప్లిన్!

అతడు విదూషకుడు. అతడు సత్రకాయి. అతడు ఆటలో అరటిపండు. అతడు గుంపులో గోవిందయ్య!

అతడు పండితుడు. అతడు పామరుడు. అతడు పండితుల్లో పామరుడు. అతడు పామరుల్లో పండితుడు!

అతడు చక్రమవుతాడు. అతడు చక్రం తిప్పుతాడు!

అతడు మహామేధావి. అతడు అమాయక చక్రవర్తి!

- ఇన్ని సుగుణాలతో వర్ధిల్లే ఆ సామాన్యుడు... ఆ సగటు మనిషి అంత చప్పున అర్థం కాడు!

అర్థమవుతున్నట్టే వుండి - అర్థం కాకుండా పోతుంటాడు!

రాజకీయంలో అపర చాణక్యులను సైతం అప్పడంలా నమిలి మింగే ఫీటు అతని సొంతం!

మయసభ నిర్మాత అతనే!

ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు భ్రమ కలిగించే ఆర్టులో అతడు అగ్రగణ్యుడు!

సదరు ఆర్టుకు చక్కటి నిదర్శనం - నిన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలు!

అధికార పార్టీ నాయకులకు - విజయం మీదేనని భ్రమ కలిగించేడు. అభివృద్ధి గురించి వారు చెప్పేవన్నీ విన్నాడు. వారి అద్భుతాలు చూసేడు. వారికి ఆశ పెట్టేడు. ఆశల పల్లకిలో ఊరేగించేడు! నిర్ణయం మాత్రం తానే తీసుకున్నాడు. వారికి చేదు అనుభవాన్ని అందించేడు!

తన సత్తా ఏమిటో చూపేడు
సామాన్యుడే-
కింగుమేకరనే
మాట నిజం చేసేడు!

ఈ సంచికలో . . .

ఓరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
జీవనశైలి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

వెల్లువ కథ... 9, 10

లేడీ డిటెక్టివ్

రియల్‌స్టోరీ... 14, 15



వన్యమృగాలు, పక్షుల నెలవు

టూరిస్ట్ గైడ్ . . . 21

విలక్షణ 'ఊహాత్మక' చిత్రకారుడు బొమ్మల శ్రీను

కళాసాహితి . . . 22, 23

ఔరా!

ఒట్టి ప్రచార పటాటోపమే!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానిది ప్రచార పటాటోపమే తప్ప అభివృద్ధి, ఆరోగ్య పథకాలు ఒట్టి డొల్లేనని ఇటీవల కేంద్రం వెల్లడించిన సమాచారం చెబుతోంది. దేశంలో వెనుకబడిన, అభివృద్ధి రాష్ట్రాల సగటు కలుపుకుని జాతీయ శిశుమరణాల సంఖ్య ప్రతి వెయ్యికి 67 ఉంది. రాష్ట్రంలో వందల కోట్లు ఖర్చు చేసి ఆస్పత్రులు కట్టించామని, పేద మహిళలకు ప్రసూతి సేవలందించడం కోసం 24 గంటలూ పనిచేసే ఆస్పత్రులు ఉన్నాయని, ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెప్పుకుంటున్నా శిశు మరణాల సంఖ్య తగ్గించ లేకపోయిందని కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. పొరుగు రాష్ట్రాల పరిస్థితి చూస్తే తమిళనాడులో ప్రతివెయ్యికి శిశుమరణాలు 48 ఉండగా, కర్నాటకలో 51, కేరళలో కేవలం 16 మాత్రమేనట!



ఐరాసకూ గ్లామర్ అవసరమే!

నిధుల సేకరణకు ఐక్యరాజ్యసమితికీ గ్లామర్ ఆసరా తప్పడంలేదు. పేద, వర్ధమాన దేశాల్లో ఆకలితో అలమటించే ప్రజలకు ఆహారాన్నందించే ప్రపంచ ఆహార కార్యక్రమానికి నిధులు సేకరించడానికి ఐరాస ఒక పథకం వేసింది. అమెరికాలో టాప్ మోడల్‌గా ఉన్న అధ్యక్షుడు జార్జిబుష్ మేనకోడలు లారెన్ బుష్‌ను ఆ పథకానికి అంతర్జాతీయ గౌరవ అధికార ప్రతినిధిగా నియమించింది. మోడల్‌గా, అధ్యక్షునితో గల బంధుత్వం ఆధారంగా ఆమె ఆహార పథకానికి నిధులు సేకరించగలరని ఐరాస అధికారుల ఆలోచన అట. ఇందుకు అనుగుణంగానే లారెన్ నిధుల సేకరణ కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్ ప్రారంభించి ఆకలిపై యుద్ధం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నారు. యుద్ధం కంటే వినాశకారి అయిన ఆకలి మంటలు ఆర్పడానికి విరాళాలు ఇవ్వాలని ధనిక దేశాల్లోని విద్యార్థులకు లారెన్ పిలుపునిస్తున్నారు.

టాటాగారి కారు పోయింది

దేశానికంతా కారులు సప్లయి చేసే రతన్ టాటా గారి కారు పోయింది. వెంటనే దొరికి పోయింది. ఇదంతా నిజం అనుకుంటున్నారా? ఒట్టిదే, అంతా డూప్. ముంబయి పోలీస్ కేంద్ర కార్యాలయంలో హైటెక్ సమాచార కార్యాలయం ప్రారంభానికి టాటాను ఆహ్వానించారు. ఈ సందర్భంగా 1090 నంబర్ ఫోన్ లైన్‌ను టాటా ప్రారంభించి తన కారు పోయిందని త్వరగా వెతికిపెట్టాలని ఒక పోలీస్‌స్టేషన్ వారిని కోరారు. వారు ఒక నిమిషం తర్వాత ఫోన్ చేసి చాలా వినయంగా పోయిన కారును కనిపెట్టామని, తీసుకువెళ్లవచ్చని టాటా గారికి చెప్పారట. ఇది కేవలం ఆ కార్యాలయం, ఫోన్ ప్రారంభం సందర్భంగా వేసిన ట్రయిల్ మాత్రమేనట. టాటా గారు ఫోన్ చేస్తారని ఆయనకు వెంటనే తగిన సమాచారం ఇవ్వాలని పోలీస్‌స్టేషన్లకు ముందుగానే ఆదేశాలు జారీచేయటంతో ఆయన ఉత్తినే కారు పోయిందని చెప్పగానే దాన్ని కనిపెట్టేశామని వెంటనే చెప్పేశారు. నిజంగా కారు పోగొట్టుకున్నపుడు కూడా ఇంతే త్వరగా కనిపెడితే ఎంత బాగుంటుంది.

కార్టూన్ కదంబం



సార్, ఇవన్నీ పార్టీ ఆఫీసులో పెట్టుకుందామా
మరెప్పుడైనా ఉపయోగపడతాయేమో!
జన్మభూమి లగేజి
జన్మభూమి రద్దు చేస్తాం: వైఎస్



ఉచిత విద్యుత్తు
సిఎం పదవి



తనతో పాటు చాలా మంది మంత్రులు ఓడినందుకు ఆయన సంతోషం...



అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య అస్తమించి 19 సంవత్సరాలు గతించాయి. మార్క్సిజం-లెనినిజం ద్వారానే భారత దేశంలో పీడిత ప్రజా విముక్తి లభిస్తుందని దృఢంగా విశ్వసించి తన జీవితాన్ని దానికే అంకితం చేసిన మహనీయుడాయన. భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ తుదిశ్వాస విడిచే వరకు పీడిత ప్రజల విముక్తికోసం పరిశ్రమించిన మహామనీషి. దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన మహానాయకుల్లో సుందరయ్య ఒకరు. దక్షిణభారత దేశంలో ఆ ఉద్యమ ప్రారంభకులు, తెలుగునాట ఉద్యమ నిర్మాత. వీరోచిత తెలంగాణా రైతాంగ విప్లవ పోరాట సారథి.

అలగానిపాడు ముద్దుబిడ్డ అమరజీవి సుందరయ్య

ఇ.వి. బాలాజీ

1913 మే 1వ తేదీన నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా (ప్రస్తుతం విడవలూరు మండలం) అలగానిపాడు గ్రామంలో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య 1985 మే 19వ తేదీన అస్తమించారు. 72 సంవత్సరాల జీవితంలో బాల్యం మినహా మిగిలిన 58 సంవత్సరాల కాలాన్ని తాను నమ్మిన మహదాశయం కోసమే ఆయన జీవించారు. అసాధారణ విప్లవదీక్షతో, మహోన్నత నైతిక విలువలతో, ఉక్కు క్రమశిక్షణతో, అనన్య త్యాగశీలత, నిరాడంబరతలతో స్వాతంత్ర్య సమరయోధునిగానూ, కమ్యూనిస్టుగానూ తన జీవితాన్ని మలచుకుని అందరి ఆదరణనూ పొందారు. పార్లమెంటరీ, పార్లమెంటేతర రంగాలు రెండింటిలోనూ ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలిగా పోరాడి పీడిత ప్రజల ప్రియతమ నాయకులుగా ప్రఖ్యాతిగాంచారు.

పుచ్చలపల్లి సుందరయ్య జన్మించిన గ్రామమంటే సహజంగానే ఆసక్తి ఉంటుంది. దేశంలోనే ప్రముఖనాయకునిగా ఎదిగిన ఆయన స్వగ్రామంలో ఆయన స్మృతులు ఎలా ఉన్నాయో చూద్దామని వెళ్లిన ప్రజాశక్తి ప్రతినిధులను మండల కేంద్రమైన విడవలూరు గ్రామ పార్టీ శాఖ కార్యదర్శి చిట్టేటి పిచ్చయ్య అలగానిపాడు తీసుకెళ్లారు. గ్రామంలోకి వెళ్ళగానే సిపిఎం సానుభూతిపరులు అనేకమంది ఆసక్తిగా మా వెంట వచ్చారు. సుందరయ్యగారంటే ఇప్పటికీ ఆ గ్రామంలో అపారమైన గౌరవం ఉంది. ఆయన సమకాలీకులు ఎవరూ లేకపోయినా, ఆయనతో పరిచయ భాగ్యం గలవారు లేకపోయినా రెండు తరాల అంతరం ఉన్నా ఆయన విడిచి వెళ్ళిన గుర్తుల ఆధారంగానే ఆ గ్రామంలోని ప్రజలు సుందరయ్య ఎంత ఉన్నతుడో తెలుసుకోగలిగారు. ఇప్పటికీ ఊరంతా సిపిఎం పట్ల ఎంతో అభిమానం చూపుతున్నారు. బాల్యంలోనూ, యుక్త వయస్సులో కొంత కాలం మినహా ఆ గ్రామంలో నివసించలేదు. ఉన్న కొద్ది కాలంలోనూ ఆయన తన గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దడానికి యత్నించారు. అంటరానితనం నిర్మూలించడానికి తన ఇంట్లోనే సహపంక్తి భోజనాలు నిర్వహించారు. వ్యవసాయ కార్మికులకు కూలి రేట్లు పెంచడానికి ఉద్యమాన్నే నిర్మించారు. కూలి రేట్లకు సంబంధించి ఆయన రూపొందించిన డాక్యుమెంటు ఇప్పటికీ అనుసరణీయమే. ప్రజలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి వయోజన పాఠశాల ప్రారంభించారు, గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశారు. వ్యాపారులు ప్రజలను మోసం చేయడానికి నిరసనగా ప్రజల భాగస్వామ్యంతో సహకార ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజుల్లో అలగానిపాడులో వ్యవసాయానికి నీటివసతి అంతగా లేదు. అప్పుడు చేనేత తదితర వ్యవసాయేతర వృత్తులు బాగానే ఉన్నాయి. కాలక్రమేణా ప్రభుత్వ విధానాల ఫలితంగా ఇప్పుడు ఆ వూర్లో చేనేత మగ్గాలు వేళ్లమీద లెక్కించగల స్థాయికి దిగజారాయి. చేనేత కార్మికులు వ్యవసాయ కార్మికులుగా మారిపోయారు.

అత్యున్నత శ్రేణి నాయకుడుగా సుందరయ్య గుర్తింపు పొందినా, ఆయన స్వగ్రామంలో స్వంత ఖర్చుతో నిర్మించిన గ్రంథాలయం శిథిలమైనా పట్టించుకునే తీరిక ఈ పాలకులకు లేదు. తనకు వచ్చిన ఆస్తినంతా పార్టీకే ఖర్చు చేసిన సుందరయ్య వాటాగా వచ్చిన ఇంటి భాగాన్ని గ్రంథాలయం ఏర్పాటుకు ఇచ్చారు. స్వయంగా వందలాది పుస్తకాలు సేకరించినవి ఇచ్చారు. ఇళ్ళ మధ్య గ్రంథపఠనం ఇబ్బందిగా ఉండటంతో దాన్ని అన్నగారికి అమ్మివేసి ఆ డబ్బుతో కొద్ది దూరంలో మరో డాబా ఇల్లు కొని గ్రంథాలయం ఏర్పాటు చేశారు. 1980 వరకు దాన్ని గ్రామ పార్టీ శాఖ నిర్వహించింది. ఆర్థికంగా కష్టం కావడంతో గ్రంథాలయాన్ని స్థానిక గ్రంథాలయాల సంస్థకు అప్పగించారు. 1990 వరకు పదేళ్ల పాటు ప్రభుత్వ నిర్వహణలో బాగానే నడిచింది. అయితే ఆ భవనం శిథిలం అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎందరో శాసనసభ్యులు, మంత్రులు ఆ గ్రామానికి వచ్చినపుడు లైబ్రరీ దుస్థితి వివరించారు. అందరూ కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చినవారే గాని పధ్నాలుగేళ్ళు గడిచినా పట్టించుకున్నవారు లేరని గ్రంథాలయాధికారి కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అర్జీలు పెట్టుకున్నా ఫలితం లేదని ఆయన వాపోయారు. సుందరయ్యగారు సేకరించిన ఎన్నో విలువైన గ్రంథాలు శిథిలమవుతుండటంతో చూడలేక పంచాయితీ వారికి చెప్పి వాటిని గ్రామ చావిడిలోకి చేర్చామని ఆయన చెప్పారు. శిథిలమైన భవనం స్థానే కొత్త భవనం నిర్మిస్తే తమ వాటాగా రు.50వేలు ఇస్తామని సిపిఎం నెల్లూరు జిల్లా శాఖ చెప్పిందని, అయినా ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోందని అన్నారు.

సుందరయ్య చిత్రమాలిక

భౌతికకాయం వద్ద అరుణాంజలి ఘటిస్తున్న లీలా సుందరయ్య

సుందరయ్య గారు వీధి బడిలో చదువుకున్నారని 1986 వరకు కూడా దాని స్థాయి పెరగలేదని గ్రామస్తులు చెప్పారు. సుందరయ్య గారి వదిన పుచ్చలపల్లి వెంకమ్మ గారు రు.3000 విరాళం ఇవ్వగా 1986లో స్కూలు కోసం పక్కా భవనం కట్టారన్నారు. తన జీవిత సర్వస్వాన్ని ప్రజలకే అంకితం చేసిన ఆ మహానాయకుని స్మృతికి గ్రామంలో ఒక చిహ్నం నిర్మించాల్సిన ప్రభుత్వం ఆయనే స్వయంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సైతం గాలికొదిలేయడాన్ని ఏమనాలి?

చిన్ననాడే తండ్రి చనిపోవడంతో అక్కగారింటికి వెళ్ళిన సుందరయ్య మద్రాసు, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో చదువు కొనసాగించారు. 13వ ఏటనే సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసిన చిచ్చర పిడుగు. 1928లో గాంధీ గారి ప్రభావంతో సత్యాగ్రహంలో పాల్గొంటూ తన పేరులో కులాన్ని తెలియచేసే రెడ్డి పదాన్ని తొలగించుకుని సుందరయ్యగా స్థిరపడ్డారు.

తన ఆశయాలకు అనుగుణంగా అలగానిపాడును తీర్చిదిద్దడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో పనిచేస్తూనే కమ్యూనిస్టు నాయకుడిగా ఎదిగారు. వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని నెల్లూరు జిల్లా అంతటా విస్తరింపచేశారు. రైతు సమస్యలపై ఆనాడు ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు 1500 మైళ్ల పాటు సాగించిన రైతు రక్షణయాత్ర వెనుక సూత్రధారి సుందరయ్యే. 1944లో అఖిలభారత రైతుమహాసభ విజయవాడలో జరిగింది. దానికి ముందే బందరు కాలువ పూడిక తీసేందుకు సుందరయ్య పూనుకున్నారు. నేడు అట్టహాసాలతో నామమాత్రంగా సాగే జన్మభూమి, శ్రమదానం వంటి కార్యక్రమాలకు నిజమైన అర్థం చెప్పిన సుందరయ్య వాటికి ఎంతో గౌరవం కల్పించారు. ఎటువంటి ఆర్భాటాలు లేకుండా 60 ఏళ్ల నాడే శ్రమదానం విలువను కమ్యూనిస్టు పార్టీ చాటి చెప్పింది. అందుకే బందరు కాలువను కమ్యూనిస్టు కాలువ అంటారు.

1943లో బొంబాయిలో ఉన్న కాలంలో పార్టీ కార్యకలాపాల్లో సహకరిస్తూ ఉండిన లైలాను సుందరయ్య వివాహం చేసుకున్నారు. ఆయన సలహాతోనే సెంట్రల్ బ్యాంక్‌లో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసిన లైలా



అలగానిపాడులో శిథిలమైన గ్రంథాలయ భవనం; గ్రామ చావడిలో చెదలు పడుతున్న విలువైన గ్రంథాలు

ఓపిక, పట్టుదల ఆయన సొత్తు

జక్కా వెంకయ్య

సిపిఎం నెల్లూరు జిల్లా కమిటీ కార్యదర్శి, కేంద్రకమిటీ సభ్యులు

1948 జనవరిలో సుందరయ్య గారు మా నాయనను చూడటానికి దామరమడుగులోని మా ఇంటికి వచ్చారు. మా నాయనమ్మ, సుందరయ్య గారి అమ్మ అక్కా చెల్లెళ్ళు. సుందరయ్య గారి చిన్న వయస్సులోనే వాళ్ళ నాయన చనిపోయారు. వాళ్ల భూములను కూడా మా నాయన సేద్యం చేసేవాడు. అందుకని మా నాయన అంటే ఆయనకు చాలా అభిమానం. పార్టీ మీద నిషేధం ఉంది, రహస్యంగా ఉంటున్నాము ఇప్పుడల్లా చూడటానికి కుదరదని అందుకే వచ్చానని చెప్పారు. పార్టీ రహస్యంగా పనిచేస్తున్న కాలంలో నాకు సంబంధాలు ఏర్పడ్డాయి. 1951లో పార్టీ సభ్యత్వం తీసుకున్నాను. 1955 ఎన్నికల్లో ప్రచారం చేయడానికి సుందరయ్య గారు నెల్లూరు వచ్చినపుడు ఆయనతో సన్నిహితత్వం పెరిగింది.

1957లో నెల్లూరు, కోవూరు తాలూకాల్లో చెరువు లోతట్టులో ఉన్న 10 వేల ఎకరాల్లో సాగు చేసుకుంటున్న రైతులను తొలగించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. అప్పుడు అసెంబ్లీలోని ప్రతిపక్ష నాయకుని హోదాలో సుందరయ్య గారు అన్ని చెరువుల లోతట్టు ప్రాంతాలు తిరిగారు. ఆయనతో పాటు 3 రోజులు నేనూ తిరిగాను. ఆయన సమయం కచ్చితంగా పాటిస్తారు. ఒకరోజు ఉదయం 6 గంటలకే రమ్మన్నారు. నేను 3 నిమిషాలు ముందుగానే వెళ్లాను. 1958లో ఒక హత్య కేసులో జైల్లో ఉన్న మమ్మల్ని చూడటానికి ఆయన నెల్లూరు జైలుకు వచ్చారు. అరగంట పాటు మాతో గడిపారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని కూలదోసిన తీరును వివరించారు. కార్యకర్తలు నిరంతరం అధ్యయనం చేయాలని, సమాచారం తెలుసుకోవాలని ఆయన ఆరాటపడేవారు. పార్టీ చీలిక తర్వాత 1965లో ప్రభుత్వం మమ్ములను అరెస్ట్ చేసింది. అప్పుడే ఆయనతో ఎక్కువ సాన్నిహిత్యం ఏర్పడింది. 1968-69లో నగ్జల్స్ చీలిక ఎదుర్కొనడానికి నెల్లూరు వచ్చారు. జిల్లా కమిటీలోని 15 మందిలో నేను, శ్రీహరి, మాలకొండయ్య సిపిఎం వెంట ఉన్నాము.

పార్టీ జిల్లా మహాసభలకు వచ్చేవారు. నిర్దిష్ట సూచనలు చేసేవారు. సుందరయ్యకు దూరదృష్టి ఎక్కువ. పట్టుదల, ఓపిక, జ్ఞాపకశక్తి చాలా ఎక్కువ. ఏ పని ప్రారంభించినా అది పూర్తయ్యేవరకు విశ్రమించరు. అనేక ఏళ్ల క్రితం జరిగిన సంఘటనలు కూడా గుర్తు ఉంచుకుంటారు.

పార్టీ పూర్తికాలం కార్యకర్తగా వచ్చేశారు. తర్వాత తన పేరును లీలగా మార్చుకున్నారు. రెండు సంవత్సరాల తర్వాత ఇద్దరూ చర్చించుకుని పిల్లలు పుట్టకుండా సుందరయ్య ఆపరేషన్ చేయించుకున్నారు. పిల్లలు పుడితే వారిని సరిగా పెంచి బాధ్యతలను నిర్వర్తించగల సమయం, అవకాశం తమకు ఉండదని వారు భావించారు. ప్రజాసేవకు ఆటంకం అవుతుందనే ఆలోచనతో సుందరయ్య, లీల దంపతులు తమ వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని త్యాగం చేశారు.

భారతదేశానికి 1947లోనే స్వాతంత్ర్యం వస్తే హైదరాబాద్ సంస్థానం మాత్రం స్వతంత్ర దేశంగానే ఉంది. 1946లోనే నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభమైంది. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన వీర తెలంగాణా విప్లవ సాయుధపోరాటం సాగింది. దానికి నాయకత్వం వహించిన అగ్ర నాయకుల్లో సుందరయ్య ఒకరు. అప్పుడు ఆయన అజ్ఞాతంగానే ఉన్నారు. ప్రధానంగా దళాలకు శిక్షణ ఇచ్చే బాధ్యతలను ఆయన చేపట్టారు. సాయుధ దళాలకు క్రమశిక్షణతో కూడిన ఉక్కు శిక్షణ ఇచ్చారు. వీరోచితంగా సాగిన ఆ పోరాటంలో 4 వేల మంది కార్యకర్తలు ఆత్మ బలిదానం చేశారు. తీవ్ర నిర్బంధం నడుమ సాగిన ఆ పోరాటం భూ సంస్కరణల ఆవశ్యకతను దేశం ముందుంచింది. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు మొదలైన ఆ పోరాటం స్వాతంత్ర్యానంతరం మూడేళ్ల పాటు సాగింది. పోరాట విరమణ అనంతరం అజ్ఞాతంగా ఉన్న దళాలు బయటకు వచ్చాయి. దళ సభ్యులపై కేసుల విషయంలో సుందరయ్య ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. వారికి చట్టపరమైన సహాయ, సహకారాల కోసం హైదరాబాద్‌లో న్యాయవాదులతో ఒక సహాయకమిటీ ఏర్పడింది. ఐదేళ్ళ పాటు కృషి చేసి అనేక మందిని జైళ్ళ నుండి విముక్తి చేయించారు. కార్యకర్తల రక్షణ కోసం అహర్నిశలు శ్రమించారు.

సంస్థానాల విలీనం అనంతరం 1952లో తొలి సాధారణ ఎన్నికలు జరిగాయి. అప్పుడు మద్రాసు శాసనసభా స్థానం నుండి రాజ్యసభకు జరిగిన ఎన్నికల్లో సుందరయ్య ఎన్నికయ్యారు. మొదటి పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతలు నిర్వహించారు. అంతటి స్థాయికి వెళ్ళినా పార్లమెంట్‌కు సైకిల్‌పైనే వెళ్లేవారు. మూడేళ్ళపాటే పార్లమెంట్‌లో ఉన్నా ప్రజాసమస్యలపై నిరంతరం ప్రభుత్వంపై పోరాడారు. ప్రధాని నెహ్రూతో కూడా వాగ్యుద్ధానికి దిగేవారు. సుందరయ్య అంటే నెహ్రూకు, అప్పటి రాజ్యసభ చైర్మన్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఎంతో అభిమానం.

1952 మే 19న పార్లమెంట్‌లో సుందరయ్య చేసిన తొలి ప్రసంగం ప్రకంపనలు పుట్టించింది. భాషా రాష్ట్రాల ఏర్పాటుపై కాంగ్రెస్ తాను చేసిన వాగ్దానాన్ని మరచిందని ఆయన తన ప్రసంగంలో విమర్శించారు. విశాలాంధ్ర ఏర్పడితే ప్రజారాజ్యం ఏర్పడుతుందనే భయంతో కాంగ్రెస్ ప్రత్యేక ఆంధ్ర నిర్మాణాన్ని వ్యతిరేకిస్తోందని అన్నారు. హైదరాబాద్‌లో నిజాంను గద్దె దించడానికి ఒకవైపు సైన్యాన్ని పంపి మరో వైపు నైజాం నవాబును రాజప్రముఖ్‌గా చేసి కోటి రూపాయల భరణం చెల్లించడంలోని అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. భారత ప్రభుత్వం నిజాంతో కుమ్మక్కై ప్రజలను అణచడానికి ఆయుధాలు అందించిందని విమర్శించారు. తెలంగాణాలో భారత సైన్యం సాగించిన అకృత్యాలను ఆయన వివరించారు. రెండు లక్షల మంది కోయ తెగ గిరిజనులను కాన్‌సెంట్రేషన్ క్యాంపుల్లో పెట్టి హింసించడంతో వైద్యం, ఆహారం లేక పది వేల మంది చనిపోయారని అన్నారు. సుందరయ్య చేసిన తొలి ప్రసంగంతో పార్లమెంట్ దిగ్భ్రాంతి చెందింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాటం


సుందరయ్య దంపతులతో డాక్టర్ శేషారెడ్డి

ఆయనతో పరిచయమే అదృష్టం

డాక్టర్ జెట్టి శేషారెడ్డి

(రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్, నెల్లూరు)

సుందరయ్య గారితో పరిచయం ఏర్పడడమే తన అదృష్టమని నెల్లూరు రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జెట్టి శేషారెడ్డి అన్నారు. సుందరయ్య గారితో ఆయనకున్న అనుబంధం ఆయన మాటల్లోనే...

1939 అప్పుడు నాకు 10 ఏళ్ల వయస్సుంటుంది. సాయంత్రం 5 గంటలకు కోవూరులోని మా ఇంటికి ఓ వ్యక్తి వచ్చారు. బలిష్టమైన కండరాలు కలిగి చెడ్డి, చొక్కా, చేతిలో బ్యాగ్‌తో వచ్చిన ఆయనకు 26 సంవత్సరాలుంటాయి. మా అమ్మకు ఆయన వరసకు తమ్ముడవుతాడు. అప్పుడప్పుడూ మా అమ్మ సుందరయ్య గారి గురించి చెప్పేది. ఆయన పట్టుదల గల వ్యక్తని, గొప్ప భావాలున్న వ్యక్తని చెప్తుండేది. సుందరయ్యగారు ఊర్లోకి వచ్చారని, పోలీసులు గాలిస్తున్నారని మా నాన్నకు తెలిసింది. అప్పుడే మొట్టమొదటిసారిగా నేను ఆయన్ను చూశాను. ఇంతలో మా ఇంట్లో వున్న సైకిల్ తీసుకుని, నెల్లూరులో ఎవరింట్లోనైనా చేర్చి మీ వద్దకు చేర్చుతానని చెప్పి ఇంటి వెనుక వున్న చెరువులో దిగి సైకిల్‌పై వెళ్లారు. ఆ తర్వాత ఆయన గురించి మా అమ్మ ఎన్నో విషయాలు నాకు చెప్పింది. ఆయన కమ్యూనిస్టని మా నాన్న చెప్పారు. 1951లో మద్రాసు మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతున్న సమయంలో తెలంగాణా ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నది. 100 మంది మెడికల్ విద్యార్థులం సుందరయ్య గారిని మద్రాసు రైల్వే స్టేషన్‌లో కలిశాం. నేను ఫలానా అని అపుడే పరిచయం చేసుకున్నాను. సుందరయ్య గారు, రామచంద్రారెడ్డి గారు మా ఇంటికి వచ్చిపోతూ వుండేవారు. నేను మద్రాసు, నెల్లూరులో జరిగే అన్ని సభలకు హాజరవుతుండే వాడిని. దీంతో మెడిసిన్ చేస్తున్న సమయంలో నాకు కమ్యూనిస్టు భావాలు ఏర్పడ్డాయి. విద్యార్థి ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నాను. ఒకసారి ఆయనను కలిసి వైద్యం మానేసి పార్టీలో పనిచేస్తానని అడిగా. నువ్వు ముందు డాక్టర్ కోర్సు పూర్తిచెయ్యి, తరువాత పార్టీలో పనిచేద్దువు గాని అని అన్నారు. పార్టీలో పనిచేయడానికి చాలా మంది వున్నారు. డాక్టర్ కోర్సు పూర్తిచేసి కమ్యూనిస్టు డాక్టర్‌గా అప్పుడు పార్టీకి పనిచేద్దువు గాని అని సలహా ఇచ్చారు. 1955లో ఉన్నత చదువు కోసం ఇంగ్లాండు వెళ్ళడానికి ఏర్పాట్లు చేసుకున్నాను. ఆయనకు ఎలా తెలిసిందో గాని విజయవాడకొచ్చి కలవాలని కబురు చేశారు. నా మనస్సులో వున్న మాట ఆయనకు చెప్పాను. ఇంగ్లాండు వెళ్లి మంచి చదువు చదువుకొచ్చి కమ్యూనిస్టు డాక్టర్‌గా ఇక్కడ పనిచేస్తానని చెప్పా. ఇంగ్లాండు సామ్రాజ్య వాద దేశం. అక్కడి నాగరికత, అలవాట్లు నిన్ను పూర్తిగా మార్చేయ వచ్చు. ఇక్కడ చదివిన చదువు పేదలకు వైద్యం అందించడానికి సరిపోతుందని చెప్పారు. దీంతో నా ఇంగ్లాండ్ ప్రయాణాన్ని విరమించుకున్నాను. నిజంగా 50 సంవత్సరాల తర్వాత ఇప్పుడనిపిస్తోంది. సుందరయ్యగారు అప్పుడు ఆ మాటలు ఎందుకు చెప్పారోనని. నెల్లూరులో డాక్టర్ రామచంద్రారెడ్డి ఆసుపత్రిని నడపడానికి ఆయన కృషి ఎంతో వుంది. నెలకొకసారి వచ్చి ఆసుపత్రిలో కమ్యూనిస్టు డాక్టర్లు ఎలా పనిచేయాలో, ఇతర విషయాలను ఆయన సలహాలు, సూచనలు ఇస్తుండేవారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాలపై ఆయనకు పట్టుండేది. అనన్య సామాన్యమైన పరిజ్ఞానం, కార్మిక వర్గంపై నమ్మకం, దీక్ష, పట్టుదల ఆయనను అంతటి నాయకుడిని చేసిందనడంలో సందేహం లేదు. 1955 ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొనేందుకు నెల్లూరు వచ్చారు. ఆయన జీప్‌కు నేను డ్రైవర్‌గా వున్నా. మనుష్యులు ఎవరూ లేనిచోట జీప్ బురదలో ఇరుక్కుపోయింది. దీంతో ఆయన ఒక్కడే జీప్‌ను తోశారు. అప్పుడాయన అంత బలంగా వుండే వారు. 1955 తరువాత ఆయన ఆరోగ్యం క్షీణించింది. పసికర్ల వ్యాధితో బాధపడుతూ మద్రాసు, రష్యాలలో ఆపరేషన్ చేయించుకున్నారు. తరువాత ఆయన శారీరకంగా దెబ్బతిన్నా, మానసికంగా దృఢంగా వుండేవారు. 1975లో ఒకరోజు టిక్కెట్ తీసుకొని నన్ను ట్రెన్ దగ్గరకు రమ్మన్నారు. ఫస్ట్ క్లాస్ రిజర్వేషన్ చేయించి తీసుకెళ్లి ఇచ్చా. వెంటనే ఆయన నేనెప్పుడైనా ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేశానా అంటూ టిక్కెట్ ఇచ్చేసి జనరల్ బోగీలో వెళ్లారు. సుందరయ్య గారు చనిపోయేటప్పుడు నేను పక్కనే వున్నా. చనిపోయే ముందు కొన్ని విషయాలు చెప్పారు. ఒకసారి ఇద్దరం జైలులో శిక్ష అనుభవిస్తున్నాం. ఆయన ఆరోగ్యం క్షీణించి మూడుసార్లు రక్తం కక్కారు. నాకేమో భయం, ఆందోళన కలిగింది. ఆయనలో అలాంటిదేమీ నేను చూడలేదు. శేషయ్యా ఎందుకు భయపడుతున్నావు. మహా అయితే చనిపోతాం అంతేగా అని అన్నారు. ఎవరైనా చనిపోయేటప్పుడు తనవాళ్లను బాగా చూసుకోవాలని చెబుతుంటారు. ఐతే ఆయన చనిపోయేటప్పుడు లీలావతమ్మను చూసుకోమని ఎవ్వరికీ చెప్పలేదు. ఆయనకు పార్టీ మీద, కార్మికుల మీద అంతటి నమ్మకం వుండేది. ఆయనను దగ్గరగా పరిశీలించే అవకాశం నాకు దక్కింది. తన బట్టలు తానే ఉతుక్కునే వారు. రిక్షా ఎప్పుడూ ఎక్కలేదు. ఆయన వల్ల నాకు ఎందరో జాతీయ స్థాయి నాయకులతో పరిచయం ఏర్పడింది. ఆయన ఇచ్చిన స్ఫూర్తి నన్ను ఇంతటి వాడ్ని చేసింది.

- పి. బాలకృష్ణ (ప్రజాశక్తి ప్రతినిధి, నెల్లూరు)

సుందరయ్య విజ్ఞానకేంద్రం





సుందరయ్య కనుమూసిన అనంతరం ఆయన స్మృతిచిహ్నంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో 'సుందరయ్య విజ్ఞానకేంద్రం నిర్మాణమైంది. ఇందులో రీడింగ్ రూమ్, పరిశోధకులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దిన గ్రంథాలయం, సమావేశ మందిరాలు ఉన్నాయి. 2000 సంవత్సరంలో సంభవించిన మూసీ వరదల కారణంగా గ్రంథాలయంలోని అపురూప, అరుదైన ప్రాచీన గ్రంథాలు తడిసిపోయాయి. దీనిని పునరుద్ధరించడానికి అమెరికాలోని ఒక సంస్థ, ఇక్కడి పలువురు అభిమానులు ఎంతో శ్రమించారు. ఈ కేంద్రంలోనే సుందరయ్య చివరి వరకు వాడిన సైకిల్, ఇతర వస్తువులు, జ్ఞాపికలతో ఒక మ్యూజియం కూడా ఉంది. విజ్ఞానకేంద్రం ఎదురుగా ఉన్న పార్క్‌కు సుందరయ్య పార్క్‌గా నగరపాలకసంస్థ నామకరణం చేసింది. అందులో ఆ మహనీయుని విగ్రహాన్ని కూడా నెలకొల్పారు. ప్రజాప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించిన గన్నవరంలో, జన్మనిచ్చిన జిల్లా కేంద్రం నెల్లూరులో ప్రజలే ఆయన విగ్రహాలు నెలకొల్పారు.





జరుగుతున్న కాలంలోనే 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పేరుతో సుందరయ్య రాసిన పుస్తకం అత్యంత ప్రజాదరణ పొందింది. ఆ తర్వాత 'ఆంధ్రప్రదేశంలో సమగ్ర నీటి పథకం' పేరుతో నీటి పారుదల పథకాలు, నీటివనరులపై రాసిన పుస్తకం ఇప్పటికీ ప్రమాణికం.

1954 సెప్టెంబర్ 3న పార్లమెంట్‌లో జరిగిన చర్చలో సుందరయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ భూటకపు భూ సంస్కరణల విధానాన్ని ఎండగట్టారు. ఆకలితో అలమటిస్తున్న కోట్లాది నిరుపేదలకు భూమి ఇవ్వకుండా సహకార వ్యవసాయం గురించి మాట్లాడడంలో అర్థం లేదని నాటి వ్యవసాయమంత్రి గుల్జారీలాల్ నందాను నిలదీశారు. పేదల కొనుగోలు శక్తి పెంచడానికి, పరిశ్రమలు పెంపొందడానికి భూ సంస్కరణలు అమలు చేయడం ప్రాథమిక చర్య అని అన్నారు. వినోభా బావే భూ దానోద్యమం బూటకమని పార్లమెంట్‌లో ఖండితంగా, నిర్మొహమాటంగా చెప్పిన నాయకుడు సుందరయ్య. వినోబా భూ దానోద్యమం భూస్వాముల మనస్సును మార్చి వేసిందనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదని స్పష్టం చేశారు.

1955లో ఆంధ్రరాష్ట్రానికి మధ్యంతర ఎన్నికలు జరిగినపుడు సుందరయ్య గన్నవరం నుండి శాసనసభకు పోటీచేసి గెలుపొందారు. సైద్ధాంతిక విభేదాలతో 1964లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ చీలి సిపిఎం ఏర్పడింది. సిపిఎం ఏర్పడిన నాటి నుండి 1977 వరకు సుందరయ్య పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. రాష్ట్రంలో బాధ్యతలు నిర్వహించుతున్న తరుణంలో 1972లో తెలంగాణా పోరాటంపై ఇంగ్లీషులో 750 పేజీల గ్రంథం రచించారు. పోరాట కాలం నాటి సంఘటనలు, తాను స్వయంగా సేకరించిన, సహనాయకుల అనుభవాలు కలిపి ఈ గ్రంథం రూపొందించారు. తర్వాత అది 'వీర తెలంగాణా విప్లవపోరాటం–గుణపాఠాలు' పేరుతో తెలుగులో వచ్చింది. అన్ని భారతీయ భాషల్లోనూ, చైనా భాషలోనూ ఆ గ్రంథాన్ని అనువదించారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంతో కూడా సన్నిహిత సంబంధాలు గల సుందరయ్య సోవియట్ యూనియన్, చైనా, క్యూబా తదితర దేశాలను సందర్శించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యమానికి అధిక సమయాన్ని వెచ్చించే లక్ష్యంతో 1977 పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి వైదొలగి రాష్ట్రానికి వచ్చేశారు. అనంతరం రాష్ట్రంలో తిరిగి రైతు ఉద్యమాలు నిర్వహించారు. 1980వ దశకం ఆరంభంలో రైతాంగ ఉద్యమాలు నడిపిన అఖిలపక్ష కమిటీ ఏర్పాటు, ఉద్యమ నిర్వహణలో కీలకపాత్ర పోషించారు.

ఏళ్ళ తరబడి అజ్ఞాతంలో గడపడం, సరైన తిండి, విశ్రాంతి, వైద్య సహాయం లేకపోవడంతో 1955 నుండి సుందరయ్య ఆరోగ్యం దెబ్బతింది. 1960లో రష్యాలో ఆయనకు ఆపరేషన్ చేశారు. 1965లో మరలా ఆపరేషన్ అవసరం కాగా సోవియట్ యూనియన్ వెళ్ళారు. ఆనాడు సిపిఎంకు సోవియట్ పార్టీతో సత్సంబంధాలు లేకపోయినా సుందరయ్య అంటే వారికి గల గౌరవం, అభిమానంతో అత్యున్నత వైద్యాన్ని అందించారు. ఆయన కడుపులో పేగుల స్థానంలో కృత్రిమ ఏర్పాటు చేసి విజయం సాధించారు. అక్కడి ఆపరేషన్‌తో ఆయన 19 ఏళ్ళ పాటు జీవించగలిగారు. 1981 తర్వాత ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. మూత్రపిండాల వ్యాధితో ఆయన బాధపడ్డారు. చికిత్స కోసం చైనా వెళ్ళి వచ్చారు. 1985లో పరిస్థితి తీవ్రం కావడంతో మద్రాసు అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 1985 మే 19వ తేదీ ఉదయం 6 గంటల 10 నిమిషాలకు అస్తమించారు. ఆ వార్తతో ఆంధ్రప్రదేశ్ స్తంభించింది. ఆయన భౌతికకాయాన్ని సందర్శించుకునేందుకు కృష్ణా తీరానికి లక్షల సంఖ్యలో ప్రజలు తరలివచ్చారంటే ఆయన పట్ల ప్రజలకు గల అభిమానం ఎంతో తెలుస్తుంది. ఆ మహనీయుని మృతికి యావద్దేశం నివాళులర్పించింది. ★

కార్యకర్తల పట్ల ఎంతో ఆప్యాయత

టి.వి. చారి

సిపిఎం కేంద్రకమిటీ కార్యాలయం కలకత్తాలో ఉన్నపుడు అక్కడ మూడేళ్ళ పాటు టైపిస్టుగా పనిచేసి సుందరయ్య గారితో దగ్గర పరిచయం ఉన్న 81 సంవత్సరాల టి. వెంకటాచారిని ఆ మహనీయుని జ్ఞాపకాల గురించి చెప్పమని అడిగినపుడు ఆయన ముఖం సంతోషంతో విప్పారింది. హైదరాబాద్ నగర పార్టీ కార్యాలయంలోనే ఉంటున్న చారి సుందరయ్య గారి వద్ద తాను ఉన్న 3 సంవత్సరాల కాలం నాటి సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకోవడానికి ప్రయత్నించారు.

"1964లో విజయవాడ పార్టీ కార్యాలయంలో ఉన్నపుడు ఢిల్లీకి రావలసిందిగా సుందరయ్య గారు కబురు చేశారు. డిసెంబర్ మాసంలో ఢిల్లీ వెళ్ళాను. ఉమ్మడి పార్టీ చీలి సిపిఎం ఏర్పడిన సంవత్సరం అది. డిసెంబర్ ఆఖరున దేశవ్యాప్తంగా ఒకేరోజు సుందరయ్యగారితో సహ 1200 మంది నాయకులను అరెస్ట్ చేశారు. నేను హరికిషన్‌సింగ్ సూర్జిత్ గారి గదిలో ఉన్నాను. బయట తాళం పెట్టి ఉంది. పైగా నాకు ఆఫీస్ కొత్త. ఆఫీస్‌కు వచ్చిన పోలీసులు అంతటా గాలించి వెళ్ళిపోయారు. ఆ తర్వాత మేజర్ జైపాల్‌సింగ్‌తో కలిసి కలకత్తా వెళ్ళాను. 1966లో సుందరయ్య గారు జైలు నుండి విడుదలై వచ్చారు. ఇక కలకత్తాలోనే పార్టీ కేంద్ర కార్యాలయం పనిచేయనారంభించింది. కేంద్రకమిటీ స్టాఫ్‌లో నేనూ ఒకడిగా ఉన్నాను. కార్యకర్తలను జాగ్రత్తగా చూసుకోవడంలో ఆయన చాలా శ్రద్ధ వహించేవారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉన్నా, భోజనం చేసినా చేయకపోయినా కార్యకర్తల ఆరోగ్యం, భోజనం, సదుపాయాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండేవారు. పని, సమయం విషయంలో చాలా నిక్కచ్చిగా ఉండే మనిషి. చెప్పిన పని చెప్పిన సమయంలో చేయకపోతే కోపం వచ్చేది. ఒకసారి 50 పేజీల డాక్యుమెంట్ టైప్ చేయమని ఇచ్చారు. ఎన్ని రోజుల్లో చేస్తావని ముందుగానే అడిగారు. నేను చేయగలిగే స్పీడ్ దృష్టిలో ఉంచుకుని రెండున్నర రోజులు పడుతుందని చెప్పాను. దానికంటే ముందుగానే పని పూర్తి చేసి ఇచ్చాను. అదే విధంగా పోలీసుల నిర్బంధం ఉన్న కాలంలో వాళ్లకి దొరక్కుండా సుందరయ్య సకల జాగ్రత్తలు తీసుకునేవారు. తాము ఎక్కడికి వెళుతున్నామో పోలీసులు కనిపెట్టకుండా ఉండటానికి మధ్యలో కారు మార్చేవారు."

సుందరయ్య గారి గురించి చాలా చెప్పాలని ఉన్నా జ్ఞప్తికి తెచ్చుకోలేకపోతున్నందుకు చారి కొంత ఆవేదన చెందారు.

శిరంశెట్టి కాంతారావు

వెల్లువ

ఉదయం ఐదు గంటలు.

"బొయ్యి..." మంటు సైరన్ మోత ఫ్యాక్టరీ ఆవరణంతా విస్తరించింది. ఫస్ట్‌షిఫ్ట్ వచ్చే వాళ్ళతో, నైట్ షిఫ్ట్ దిగే వాళ్ళతో 'టైమ్ ఆఫీస్' దగ్గరంతా సందడి సందడిగా ఉంది...

పవర్ ప్లాంట్ కంట్రోల్ రూమ్‌లో ప్యానెల్ బోర్డు ముందు కూర్చుని రిలీవర్ కోసం ఎదురు చూస్తున్నాడు. నైట్‌డ్యూటీ చేసిన బాయిలర్ ఆపరేటర్ ముకుంద్.

హఠాత్తుగా ప్యానెల్ బోర్డులో డ్రమ్ లెవెల్ హై ఇండికేటరొచ్చి "ట్రింగ్..." మంటు జెట్ బాంబర్‌లా అలారం ఊటర్ మోత్తుకోసాగింది.

నిశ్చలంగా ఉన్న చెరువు నీళ్ళు, అకస్మాత్తుగా పడిన రాళ్ళ వానకు అల్లకల్లోలమైనట్టు కంట్రోల్ రూమ్‌లో వాళ్ళంతా పరుగులు పెట్టసాగారు.

ముకుంద్ వెంటనే బ్లోడౌన్ చేద్దామని 'ఎఫ్‌హ్యాండిల్ తీసుకొని బాయిలర్ మీదుకు పరుగెత్తి క్లాక్ ఓపెన్‌లో పెట్టి వాల్వ్ విప్పసాగాడు...

ఈలోగానే స్టీమ్ లైన్లోకి వాటర్ ఎంటరై 'గాస్కెట్స్' అన్నీ కొట్టెయ్యడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో లీకైపోతుంటే... బ్లోడౌన్ శబ్దం కూడా జతగలిసి ఆ చుట్టుపక్కల ఉన్న వాళ్ళు చెవులు బద్దలవ్వసాగాయి.

బాయిలర్ మీదున్న ముకుంద్‌కు స్టీమ్ శబ్దానికి తల తిరిగిపోతున్నా, శరీరం మొత్తం ఆవిరితో కుమ్ములో పెట్టినట్టు ఉడికిపోతున్నా ఆగకుండా బ్లోడౌన్ వాల్వ్ పూర్తిగా ఓపెన్ చేసి లేస్తుండగా...

"ఢాం...." అంటు భూకంపం ఏదో వచ్చినట్టుగా బాయిలర్ పేలిపోయింది.

ఆ శబ్దానికి టర్బైన్ హాల్లోనూ, ఆ చుట్టుపక్కలా ఉన్న వాళ్ళంతా స్పృహ తప్పి పడిపోయారు.

బాయిలర్ స్ట్రక్చర్ మొత్తం ముక్కలు, ముక్కలై దూరంగా ఎక్కడెక్కడో ఎగిరిపడింది.

ప్రమాదాన్ని గ్రహించిన మిగతా కార్మికులంతా జీవశక్తిని మొత్తాన్నీ పాదాల్లోకి తెచ్చుకుంటూ బాయిలర్ వైపు పరుగెత్తుకొచ్చారు.

"అంబులెన్స్! అంబులెన్స్!" అంటు అరుచుకుంటూ మరికొందరు అటువైపు పరుగెత్తారు. సరిగ్గా సమయానికి మొండికేసి కూర్చుందది.

ఆగ్రహం చెందిన కార్మికులంతా అలాంటి అంబులెన్స్ పెట్టినందుకు యాజమాన్యాన్ని దుర్భాషలాడుతూ యార్డ్‌లో కోల్ అన్‌లోడ్ చేసి వస్తున్న టిప్పర్ని ప్రమాద స్థలం వైపు మళ్ళించారు.

ప్రమాద స్థలానికి పరుగెత్తుకొచ్చిన వాళ్ళందరికీ, కత్తిపెట్టి కోసిన పుచ్చుముక్కల్లా, ఎర్రటి మాంసపు కండలు చిందర, వందరగా పడి కన్పిస్తుంటే, కడుపులో చెయ్యిపెట్టి పిసికినట్టు అన్పిస్తుంటే అవి ఎవరివో? ఏంటో! అర్థం కాక షాకై చూడసాగారు.

స్పృహ తప్పి పడిపోయిన ఎలక్ట్రికల్ ఇంజనీర్ శ్యాంబాబు తేరుకొని లేచి "ముకుంద్‌ని చూడండి... ముకుంద్‌ను చూడండీ..." అంటు హిస్టీరియా వచ్చిన వాడిలా అరుస్తు వణికిపోసాగాడు.

అక్కడున్న వాళ్ళందరికీ అప్పుడర్థమైంది తాము చూస్తున్న మాంసపు ముద్దలు ముకుంద్‌వని.

మరుక్షణం అందరిలోనూ రక్తం ఆవిరైపోతున్నట్టు, నరాలు వడి తిరిగిపోతున్నట్టు భావన అలుముకుంది.

ఎటుచూసినా నిశ్శబ్దమే నిశ్శబ్దం. నిశ్శబ్దం ఎంత పైశాచికమైందో అక్కడున్న అందరికీ ఆ క్షణంలో అనుభవంలోకి వచ్చింది.

ఆ తర్వాత మొదలైంది ఉప్పెనలాంటి ఆక్రందనల రొద.

ప్రమాదం విషయం తెలిసిన ఉన్నతాధికారులు, ముకుంద్ భార్యాబిడ్డలు, కార్మికులు, యూనియన్ల నాయకులు నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

ముకుంద్ భార్య, బిడ్డలు తునకలైన అతని శరీర భాగాల్ని ఏరుకుంటు ఏడుస్తున్న దృశ్యం చూస్తున్న వాళ్ళ గుండెల్లో మందుపాతర్లె పేలసాగింది.

ప్రతిపక్ష యూనియన్ నాయకుడు సత్యంతో పాటు కార్మికులంతా ముకుంద్ కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు, అతని భార్యకు ఉద్యోగం కూడా ఇవ్వాలంటూ ఆందోళనకు దిగారు.

యాజమాన్యానికి బాగా కావాల్సిన వాడు, కంపెనీ ఛైర్మన్‌కి సన్నిహితుడు, గుర్తింపు సంఘం ప్రెసిడెంట్ అయిన భూపతి సరిగ్గా అదే సమయానికి హైదరాబాద్ నుండి బస్సు దిగాడు.

భూపతికి నలభై ఏడేండ్లుంటాయి. గుంటనక్కలాంటి వ్యక్తిత్వం. కంపెనీ ఛైర్మన్‌ది అతనిది ఒకే కులం కావడంతో అతనికి ఛైర్మన్ దగ్గర చనువెక్కువ.

ఇద్దరూ కూర్చొని అప్పుడప్పుడు సిట్టింగులు కూడా వేస్తుంటారు.

"అమ్మాయిల బలహీనత ఉన్న ఆ ముసలి ఛైర్మన్‌కి, ఆ విషయంలో భూపతి సహకరిస్తుంటాడని అందుకే ఛైర్మన్‌కి అతనంటే అంత అభిమానమని" కార్మికులు గుస, గుసగా అనుకుంటుంటారు.

ఆ కారణం వల్లనే యూనియన్ ఎన్నికల్లో యాజమాన్యం అండదండలతో కార్మికుల్ని బెదిరించో, ఆశపెట్టో ప్రతిసారీ గెలుస్తుంటాడు భూపతి.

బస్సు దిగీ, దిగడంతోటే విషయం తెలుసుకున్న భూపతి అందరితో పాటు మృతుని కుటుంబానికి న్యాయం చెయ్యాలంటు పెద్ద పెట్టున నినాదాలిస్తూ ఆందోళనలో పాల్గొన్నాడు.

కొద్దిసేపటి తర్వాత భూపతి జేబులోని సెల్ 'సారేజహాసె అచ్చా...' రింగ్‌టోన్‌తో మోగింది.

తీసి చూసిన భూపతి, అది హైదరాబాద్ నుండి ఛైర్మన్ కాల్ కావడంతో దూరంగా వెళ్ళి మాట్లాడొచ్చాడు గాని, విషయమేంటో ఎవ్వరికీ చెప్పలేదు.

ఆ తర్వాత పదినిమిషాలకే యూనియన్ లీడర్లందరికీ జి.ఎమ్. ఆఫీస్ నుండి పిలుపొచ్చింది.

అక్కడ జి.ఎమ్.తో పాటు ఇద్దరు, ముగ్గురు ఉన్నతాధికారులు కూడా ముఖాలు విచారంగా పెట్టుకొని కూర్చున్నారు.

జి.ఎమ్. సూటిగా విషయానికొస్తూ "చూడండీ! జరిగింది పెద్ద ఘోరమే. కనీసం దహన సంస్కారాలకు కూడా ఆస్కారం లేకుండా శరీరమంతా ముక్కలై పోయినందుకు చాలా బాధగా వుంది. మీరంతా అంటున్నట్టు ఇందులో యాజమాన్యం తప్పేమీ లేదు. సేఫ్టీ పాయింట్ ఆఫ్ వ్యూలో మేం ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే వున్నాం. అయినా డ్రమ్ లెవెల్ జాగ్రత్తగా చూసుకున్నట్లయితే ఇంత పెద్ద ప్రమాదం జరిగేది కాదు. యాజమాన్యానికి కోట్ల రూపాయల నష్టం వచ్చేది కాదు..."

జి.ఎమ్. మాటల్ని మధ్యలోనే అడ్డుకుంటూ ప్రతిపక్ష నాయకుడు సత్యం "చూడండిసార్! జరిగిన ప్రమాదానికి డ్రమ్ లెవల్‌కి అసలు సంబంధం లేదు. పైగా అతను కొత్తవాడు కాదు చూసుకోకుండా ఉండడానికి. చచ్చిపోయిన వాడి మీదికి తోసెయ్యాలని చూడ్డం భావ్యం

కాదు. మీరు తీసుకొన్న సేఫ్టీ మెజర్సేంటో మీకు తెలియంది కాదు. బాయిలర్ ట్యూబ్సన్నీ పాతబడ్డాయి, ఏ క్షణంలో ఏం జరుగుతుందో చెప్పలేం. వాటిని వెంటనే మార్పించండని మేం ఎన్నిసార్లు మొత్తుకున్నా వినిపించుకున్నారా? ఇప్పుడేం జరిగింది? చేసేయన్నీ చేసి ఇప్పుడేంటో కతలల్లుతున్నారు...!

కార్మికుల భద్రత మీద మీకెంత శ్రద్ధుందో మన అంబులెన్స్ పరిస్థితి చూస్తేనే తెలుస్తుంది. రూల్ ప్రకారం కంపెనీలో ఓ అంబులెన్స్ ఉండాలి కాబట్టి పేరుకు పెట్టారు. ఎప్పుడైనా అవసరానికది పని చేసిందా?" అంటూ మేనేజ్‌మెంట్ వైఫల్యాల మీద విరుచుకు పడ్డాడు.

"అబ్బా! మీ యూనియన్‌తో వచ్చిన చిక్కే ఇదయ్యా! ప్రతిదానికి అడ్డు తగులుతూ రూల్స్, రెగ్యులేషన్స్ మాట్లాడుతుంటారు. ఎవరు మారినా మీరు మారరు" అసహనంతో అన్నాడు జి.ఎమ్.

"సార్! మేం ఉన్న విషయాలే మాట్లాడుతున్నాం. ముందు బాధిత కుటుంబానికి ఏమేం ఇస్తారో తేల్చండి" ఓపిగ్గా మాట్లాడాడు సత్యం.

పరిస్థితి చెయ్యి దాటిపోకుండా మేల్కొన్న జి.ఎమ్. రూట్ మార్చి "ఒక్క నిమిషం హైదరాబాద్ మాట్లాడ్తాను" అంటూ సెల్ అందుకున్నాడు.

గంటల తరబడి చర్చల తర్వాత ప్రతిపక్ష యూనియన్ వత్తిడికి తోడు, కార్మికుల ఆందోళన అంతకంతకు ఉధృతం కావడంతో పాటు, భూపతి కూడా ఈ విషయంలో ఏం చెయ్యలేడని గ్రహించిన యాజమాన్యం అడిగిన డిమాండ్లన్నిటికీ తలవంచింది.

ఆ తర్వాతే జరిగాయి ముకుంద్ శరీర భాగాలకు అంత్యక్రియలు.

* * *

ముకుంద్ పని జేస్తుంది ఓ ప్రైవేట్ సిమెంట్ ఫ్యాక్టరీ. దాని యాజమాన్యానికి, ముఖ్యంగా ఛైర్మన్‌కి రాష్ట్ర మంత్రివర్గంలో చాలా మందితో వ్యక్తిగత సంబంధాలున్నాయి.

గవర్నమెంట రాయితీలతో పాటు, పవర్‌కట్ ఇబ్బందుల్ని అధిగమించేందుకు క్యాప్టివ్ పవర్ ప్లాంట్ కూడా కట్టి నడుపుతుంది యాజమాన్యం.

ముకుంద్ భార్య కనక. తను చదువుకోలేదు.

వాళ్ళకిద్దరాడ పిల్లలు. పెద్దమ్మాయి రాణి డిగ్రీ సెకండియర్. రెండో అమ్మాయి వేణి ఇంటర్ ఫస్టియర్.

ఇన్నాళ్ళూ ఏ విషయంలోనూ భార్యా, పిల్లల్ని గుమ్మం దాటి బైటికి పోనివ్వకుండా, అన్నీ తానై చూసుకున్న ముకుంద్ అకస్మాత్తుగా పోవడంతో వాళ్ళంతా ఒడ్డున పడ్డ చేపల్లా అయిపోయారు.

అలలుండేదే నీరు - మలుపులుండేదే జీవితం. ఏ అల, ఏ తీరం చేరుతుందో? - ఏ మలుపు ఏ మార్పుకు దారితీస్తుందో?

కార్మికుల అసంతృప్తిని, యూనియన్ల వత్తిడిని తప్పించుకోవడానికి అడిగిందల్లా ఇస్తానన్న యాజమాన్యం ఆ తర్వాత పెద్దగా పట్టించుకోవడం లేదు.

పైగా....

"మీరు నెలరోజుల్లో కంపెనీ క్వార్టర్ ఖాళీ చెయ్యాలి" అంటూ ముకుంద్ భార్యకు నోటీస్ పంపించింది.

విషయం తెలిసిన ప్రతిపక్ష నాయకుడు సత్యం వెంటనే జి.ఎమ్. దగ్గరకెళ్ళి "ఇదేం అన్యాయమండీ! వాళ్ళకివ్వాల్సిన రాయితీలివ్వకపోగా క్వార్టర్ ఖాళీ చెయ్యాలంటూ లెటర్ పంపించారు. అసలా అమ్మాయి ఉద్యోగం సంగతేమైంది. దాని సంగతి తేల్చండి" అంటూ గట్టిగా వేసుకున్నాడు.

ఇద్దరి మధ్యా మాటా మాటా పెరిగింది.

చివరికి "పది రోజుల్లో ఆ అమ్మాయికి పోస్ట్ ఇవ్వకపోతే జరగబోయే దానికి మీరే బాధ్యులు" అంటు బైటకొచ్చాడు సత్యం. వెంటనే ఫోన్ మీద భూపతిని పిలిపించుకున్నాడు జి.ఎమ్.

ఫలితంగా భూపతి సందు చూసుకొని ముకుంద్ భార్య దగ్గరకెళ్ళి "చూడండీ! ఆ సత్యంగాడితో పెట్టుకుంటే మీకేపనీ కాదు. నేను ఛైర్మన్‌తో అన్ని విషయాలు మాట్లాడి సెటిల్ చేస్తా సరేనా!" చొరవగా కుర్చీ లాక్కుని కూర్చుంటూ అన్నాడు.

ప్లాను ప్రకారం, "ఏ పనైనా తాను చెబితే మేనేజ్‌మెంట్ చేస్తుంది. సత్యం అడిగితే చేసేది కూడా చెయ్యదు" అని అపోహలో ముకుంద్ భార్యా, బిడ్డల్ని పడేశాడు భూపతి.

ముకుంద్ పోయింతర్వాత చిన్న చిన్న విషయాల మీద కనకతో గొడవలు పెట్టుకొని అతని తాలుకు బంధువులంతా ఆ కుటుంబానికి దూరమయ్యారు. చెప్పుడు మాటలతో నిజాయితీపరుడైన సత్యాన్నీ దూరం చేసుకున్నారు.

ప్రతి చిన్న విషయానికీ భూపతి మీదే ఆధారపడసాగింది ముకుంద్ భార్య. దాంతో అతను రోజుకొకసారైనా ముకుంద్ ఇంటికొచ్చిపోతున్నాడు.



"తమ మంచి చెడ్డలు చూసుకోవడానికి ఇంటికొస్తున్న పెద్దమనిషిని కూర్చోబెట్టి కాఫీ, టీలన్నా ఇవ్వకపోతే ఎలా?" అనుకున్న కనక భూపతికి మర్యాదలు చెయ్యసాగింది. "ఎంత యూనియన్ లీడరైనా రోజూ ఇంటికేం పని?"

"గంటలు, గంటలు ఏంటా బాతాఖానీ"

"మొగుడుచచ్చి ఆర్నెల్లు కాలేదు, అప్పుడే పరాయివాడితో వ్యవహారాలా!?"

"వయసొచ్చిన పిల్లల్ని ఇంట్లో పెట్టుకొని ఏంటా పన్లు."

కాలనీలో అమ్మలక్కలు కనకను గురించి రకరకాలుగా చెవులు కొరుక్కోవడం మొదలు పెట్టారు. భూపతి కోరుకుంది కూడా అదే మరి.

ఒకరిది అమాయకత్వం. మరొకరిది అవకాశవాదం. ఇంకొందరిది సగటు మనస్తత్వం.

ఒకరిది నమ్మకం, మరొకరిది వంచన, ఇంకొందరిది ఎదుటి వాళ్ళ బతుకుల మీద అవసరానికి మించిన ఆసక్తి.

లోకులు పలుగాకులు. నిస్సహాయుల మీద ఇనుప ముక్కులతో దాడి చేసి, మానసికంగా పొడుచుకు తినాలని చూస్తుంటారు.

* * *

"కనకా! రేపొద్దున్నే ట్రైన్‌కి బయలుదేరు. వరంగల్ పి.ఎఫ్. ఆఫీస్‌కి పొయ్యొద్దాం. చెక్కులు తయారయ్యాయని ఫోన్ చేశారు!" అంటూ వచ్చాడు భూపతి. "పిల్లల్ని కూడా తీసుకురావాల్నా?"

"వాళ్ళెందుకు? అవసరం లేదు. పని చూసుకొని సాయంత్రం వరకు వచ్చేద్దాం."

"అలాగే ఆ ఎల్.ఐ.సి. వాళ్ళతో మళ్ళోసారి మాట్లాడ్తారా?" "మాట్లాడ్తాలే."

తెల్లవారుఝామున ఐదు గంటలకల్లా వచ్చి కనక వాళ్ళ తలుపు తట్టాడు భూపతి.

అప్పటికే తయారై వున్న కనక హ్యాండ్‌బ్యాగ్‌తో బైటికొచ్చింది.

చుట్టుపక్కల క్వార్టర్లలోని చాలా కళ్ళు ప్రశ్నార్థకంగా తెరుచుకున్నాయి. బుగ్గ మీద వేళ్ళు నొక్కుళ్ళతో సొట్టలు పడ్డాయి.

ట్రైన్‌లో ఎక్కినప్పటి నుండి భూపతి మాటల్లో, చేతల్లో మామూలు కంటే ఎక్కువ చొరవ కొట్టొచ్చినట్టు కన్పిస్తున్నా ఏమీ అనలేక వెర్రిదాన్లా నవ్వుతూ భరాయించసాగింది కనక.

పదిగంటలకల్లా రైలు వరంగల్‌లో ఆగింది. ముందు భూపతి, ఆ వెనుక కనకా దిగారు. "టిఫిన్ చేసి పోదాం" అంటూ స్టార్ హోటల్ లాంటి పెద్ద హోటల్‌కి దారి తీశాడు భూపతి. గొర్రెలా అనుసరించి కనక. ఫస్ట్‌క్లాస్ ఎ.సి. ఫ్యామిలీ రూమ్‌లో ఇద్దరే ఎదురెదురుగా కూర్చున్నాడు. టిఫిన్‌కి ఆర్డరిచ్చాడు భూపతి.

టీవీ సీరియల్స్‌లోనో, సినిమాల్లోనో కనించే సన్నివేశాలు వాస్తవంగా కళ్ళముందు కన్పిస్తుంటే జీవితంలో మొట్టమొదటిసారిగా తన మనసు మీద పట్టుకోల్పోయిన కనక భూపతితో కలిసి రంగుల ఊహల్లో అడుగు పెట్టింది.

'ఇనుము బాగా వేడెక్కినప్పుడు దెబ్బకొట్టాలి' అన్న సూత్రం బాగా తెలిసిన భూపతి ఎదుటి సీట్లో కూర్చున్న వాడు కాస్తా వచ్చి పక్క సీట్లో కూర్చుని కనక వంటి మీద చెయ్యేశాడు.

నిప్పు సెగకు కరిగిపోయే వెన్నపూసలా పూర్తిగా భూపతి వశమైపోయింది కనక.

* * *

కనక ఇప్పుడు పూర్తిగా భూపతి మనిషి.

కాలనీలో ఆడవాళ్ళు, ఫ్యాక్టరీలో కార్మికులు వాళ్ళను గురించి అదేపనిగా చెప్పుకోసాగారు.

విషయం తెలిసిన సత్యం ఒకరోజు కనక ఇంటికెళ్ళి "చూడమ్మా! ముకుంద్ బతికున్నంత కాలం మీ కుటుంబం గౌరంగా బతికింది. దురదృష్టవశాత్తు జరక్కూడంది జరిగింది. పోయిన మనిషిని ఎలాగూ తీసుకురాలేం. కానీ, ఉన్న పరువు పోకుండా చూసుకోవాలి.

నీ భవిష్యత్తు, నీ పిల్లల భవిష్యత్తు గురించి ఓ అన్నలా భావించి చెబుతున్నా, ఆ భూపతితో ఎంతవరకుండాలో అంతవరకుండడం మంచిది. మీ గురించి నలుగురు నానా రకాలుగా చెప్పుకుంటున్నారు. అంతగా నీ ఉద్యోగం విషయమే అయితే మేనేజ్‌మెంట్‌తో మేం మాట్లాడుతాం."

"మీరేదో పెద్దోళ్ళని ఇంతసేపూ ఊర్కున్నాను. ఎవరితో ఎంతవరకుండాలో నాకు తెలుసు, మీ సలహాలేం

(మిగతా 15వ పేజీలో)

మాదుగుందు కృష్ణ

పోరు నష్టం

బాగ్దాద్‌లో బాంబులు పేలుతున్నాయి. ఎవరికి వారు ప్రాణరక్షణకై పాకులాడుతున్నారు. యుద్ధంలో తమ బంధువులను కోల్పోయి, వాళ్ల శవాలను దాటుకొంటూ వెళ్లవలసి వస్తున్నందుకు ఎంతో దుఃఖించారు. బాధపడ్డారు.

బాగ్దాద్ నగరం చివరన విసిరేసినట్టున్న ఇళ్లమీదకూడా బాంబుల వర్షం కురిసింది. ఆ పేలుళ్లలో తల్లిదండ్రులను కోల్పోయి అవ్వతోపాటు వుంటున్నారు ఇద్దరు బాలురు. అవ్వ అల్లానా ఏదో వ్యాధితో బాధపడుతున్నది. అయినా వారిని జాగ్రత్తగా చూచుకోవడంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించలేదు.

తనకు ఎంత జ్వరమున్నా పిల్లలను తీసుకొనిపోయి వరుసలో నిలబడి ఆహారపు పొట్లాలను అందుకునేది. ఆ రోజు ఆహారం సరఫరా చేసేవారు అందరికీ ఒక్కొక్క రొట్టెను మాత్రమే పంచారు. అలా రోజుకు ఒకసారే పంచుతారు.

పిల్లలు తమకు ఇచ్చిన చెరో రొట్టెను తృప్తిగా తిన్నారు. కడుపు నిండింది. మళ్లీ సాయంత్రం అయ్యేటప్పటికి బాగా ఆకలి వేసింది వాళ్లకి.

"అవ్వా! ఆకలి దంచేస్తోంది. తినడానికి ఏదైనా వుంటే ఇవ్వవూ" అని అడిగారు పిల్లలిద్దరూ.

వాళ్లు ఇలా అడుగుతారని అవ్వ ముందే ఊహించింది. తన రొట్టెను తినకుండా దాచి పెట్టింది. బార్లీ గంజి మాత్రమే తాగి ఆకలి తీర్చుకుంది.

బాగా నీరసంగా వుండడంతో "ఒరే పిల్లలూ! మీ ఆకలి నాకు తెలుసురా. ఆ బల్ల మీద ఒక రొట్టె వుంది. చెరో సగం చేసుకొని తినండి" అంది అవ్వ.

పెద్దోడు దాన్ని తీసుకొని "నాకెక్కువ. నీకు తక్కువ" అంటూ రొట్టె విరవబోయాడు. "అదేం కుదరదు. నేను చిన్నోణ్ణి. నాకే ఎక్కువ రావాలి" అంటూ ఇద్దరూ పోట్లాడుకోసాగారు.

ఆ మాటలు అవ్వకు స్పష్టంగా వినవడసాగాయి. వారిని వారించాలనుకుంది. కానీ ఆమె మంచం నుండి లేవలేని స్థితిలో వుంది.

"నాకు కావాలి... నాకు కావాలి..." అనుకుంటూ కొంతదూరం వెళ్లాక రొట్టె వారి చేతిలోంచి కిందకు జారి, మురికిగుంటలో పడిపోయింది. చేతికందింది నోటికందక వాళ్లు విచారించారు. అతికష్టమ్మీద అవ్వ అక్కడకు చేరుకుంది.

పరిస్థితి గమనించిన అవ్వ, "చూశారా పిల్లలూ! ఏం జరిగిందో! రొట్టెను మీరిద్దరూ సమానంగా తింటే హాయిగా కడుపు నిండేది. అలా కాకుండా కొట్లాడుకోవడం వల్ల నేలపాలైంది. తోడబుట్టిన వాళ్లు కలిసిమెలిసి వుండాలే తప్ప కొట్లాడుకోకూడదు" అంది బాధగా.

అవ్వ మాటల్లోని నిజం ఆ పసికూనలకు అర్థమైంది. అప్పటి నుండి పోట్లాడుకోకుండా కలిసి మెలిసి జీవించసాగారు. ✪



చిన్నారి చిత్రకారులు

పి.పొన్నుస్వామి,
8వ తరగతి,
విఆర్‌కళాశాల, నెల్లూరు.

ఎ.అనూష,
6వ తరగతి,
ఆంధ్ర పబ్లిక్ స్కూలు,
హరిపాలెం, విశాఖ.



పి.శ్రీజ,
5వతరగతి,
ఠాగూర్ విద్యాలయం,
వైరా,
ఖమ్మం.



జి.హరీష్,
6వతరగతి,
డగ్గస్ మెమోరియల్ స్కూల్,
శ్రీకాకుళం.

ఎం.అనుదీప్,
6వ తరగతి,
సూర్యనగర్,
అమలాపురం,
తూర్పుగోదావరి.



పి.పల్లవి ప్రియ,
5వతరగతి,
ఠాగూర్ విద్యాలయం,
వైరా,
ఖమ్మం.

ఎవరున్నారు?

మ్యాజిక్ మ్యాజిక్

హాయ్ం! ఏంటి అంతా ఉత్సాహంగా కనిపిస్తున్నారు? అవునూ బాలనేస్తాలు పేజీ అంతా చదువుతున్నారా? మాకు తెలును. మీరు ఒక్క అక్షరం కూడా వదలకుండా చదివేస్తారని. అది సరేకాని మీరంతా ఆదివారం పుస్తకం కోసం తెగ ఎదురు చూస్తున్నట్టున్నారే! సరే. వచ్చేసిందికదా. మరి ఈ వారవు మ్యాజిక్‌లో వచ్చిన బొమ్మలో ఏమేం వున్నాయో చెప్పండి చూద్దాం. తొందరేం లేదు. బాగా పరిశీలనగా చ చెప్పండి. 'ఆ... ఇందులో ఒక మ వున్నాడు. ఇంకా...ఏదో వున్నట్టుంది కానీ అదేంటో అర్థంకావడం అంటున్నారు చాలామంది నేస్తాలు. సరే. మీరు చెప్పింది చాలా వ కరెక్టే. కాకపోతే ఆ మనిషి ఏం చేస్తున్నాడో చెప్పాలి. ఏంటీ... తెలీడంలే మరి మమ్మల్ని చెప్పమంటారా? చెప్పేస్తున్నాం. ఆ వ్యక్తి ఒక బూ ఊదుతున్నాడు. బూరంటే బెలూన్ అనుకునేరు. అదో సంగీతసా ఇంకా ఆ బొమ్మలో ఓ అమ్మాయి ముఖంకూడా వుంది. మేం చె అవన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయికదూ. మరి అదే మ్యాజిక్ మ్యాజిక్

రంగులు అద్దుదామా

గణిత భాషా

సరదా లెక్క

చిన్నారులూ! ఇవాళ మీకు ఒక తమాషా పరీక్ష పెట్టాలనిపిస్తోంది. అది ఎందులో అనుకుంటున్నారు. మీకు ఎంతో ఇష్టమైన గణితంలో. కొందరు సంతోషంతో చప్పట్లు చరుస్తున్నారు. కొందరేమో కాస్త భయంగా చూస్తున్నారు. కానీ ఇది ఏ మాత్రం కష్టంగా వుండదని మాత్రం చెప్పగలను. పైగా తమాషాగా కూడా వుంటుంది. నిజ్జం. మరి సిద్ధంగా వున్నారా? మేం కొన్ని వాక్యాలు ఇస్తాం. వాటిని గణితపు గుర్తులను ఉపయోగించి రాయాలి. రెడీ వన్...టు..త్రీ...

1.కామాక్షి చక్కని చుక్క 2.పై అరలో పావురము వున్నది. 3. గీత చుక్కల ముగ్గు వేస్తోంది. 4.కూరలో కొంచెం ఉప్పు వెయ్యి. 5.అరటికాయలో అనేక పోషక పదార్థాలుంటాయి.

వీటిలో ఎక్కడెక్కడ గణితగుర్తులు వస్తాయో చదివేటప్పుడే తెలిసిపోతుంది. మరి జవాబులు చెప్పేస్తారా? ఆ...ఆగండాగండి.ఇప్పుడుకాదు. వచ్చేవారం చెప్పాలి.

నది దాటడం ఎలా?

చిక్కుప్రశ్న

హాయ్ నేస్తాలూ...! ఇవాళ మీకోసం ఒక సులభమైన చిక్కు ప్రశ్న తీసుకొచ్చాం. ఇలా చదవంగానే అలా సమాధానం చెప్పెయ్యాలి. రెడీనా?

ఒకసారి ఓ తండ్రి, ఇద్దరు కొడుకులూ నది దాటవలసి వచ్చింది. తండ్రి బరువు సింపుల్‌గా ఎనభై కేజీలు. ఒక్కొక్క కొడుకు బరువు సరిగ్గా నలభై కేజీలు. నది ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకి చేరాలంటే ఒక చిన్న పడవమీద ప్రయాణించాలి. అయితే అది సుమారు ఎనభై కేజీల బరువును మాత్రమే మోయగలదు. ఇదీ విషయం. ఇప్పుడు చెప్పండి. తండ్రీ కొడుకులు అవతలి ఒడ్డుకి చేరడం ఎలా?

తొందరేం లేదు. వారం రోజుల గడువు ఇస్తున్నాం. బాగా ఆలోచించుకుని వచ్చేవారం చెప్పండే.

8	2	5	7	3
		6		
		4		
		9		
		1		

ఎటునుండి లెక్కించినా పాతికే

హాయ్! ఈ గడుల్లో అంకెలను కలిపి చూడండే. ఎటునుంచి కూడినా పాతికే వస్తుంది. సరదాగా వుంది కదూ.

నల్లి-పేను



పూర్వం మందవిస్పరణి అనే పేను వుండేది. అది రాజుగారి మంచంలో దూరి జీవిస్తుండేది. రాజు మంచి నిద్రలో వున్నప్పుడు అది రక్తం పీల్చి తాగుతుండేది. ఒక రోజు డిండికమనే నల్లి ఆ మంచం మీదకు వచ్చింది. పేను ఆ నల్లికి మర్యాద చేసి, "ఇలా ఎందుకు వచ్చావు?" అని అడిగింది.

"పేను బావా! నేను చాలామంది రక్తం తాగాను. కానీ రాజులది తాగలేదు. పంచభక్ష్య పరమాన్నాలు తినే రాజుల రక్తం రుచిగా వుంటుందని ఎవరో చెప్పగా విన్నాను. అప్పటి నుండి రాజుల రక్తం రుచి చూడాలనుకుంటున్నాను. నువ్వు చాలా మంచివాడివి కదా. నా కోరిక తీర్చవా!" అంది నల్లి. అది అంతగా ప్రాధేయపడుతుంటే పేను కాదనలేకపోయింది. "అలాగే! కానీ జాగ్రత్తగా నడుచుకోవాలి. రాజుగారికి నిద్రాభంగం కలగకుండా రక్తం తాగాలి" అంటూ జాగ్రత్తలు చెప్పింది పేను. "సరే!" అంది నల్లి. 'రాత్రి ఎప్పుడు అవుతుందా' అని ఎదురుచూడసాగింది. ఆ రోజు రాజుగారు సుష్టుగా తిని నిద్ర పోవడానికి మంచం దగ్గరకు వచ్చాడు. పడుకున్నాడు కానీ ఇంకా నిద్రపోలేదు. రాజు రక్తం రుచి చూడాలని ఉవ్విళ్లూరుతున్న నల్లి రాజుగారికి నిద్ర పట్టకముందే గట్టిగా కుట్టి రక్తం తాగసాగింది. ఆయనకు వెంటనే మెలకువ వచ్చింది. భటుల్ని పిలిచాడు.

"నన్నేదో కుట్టింది. అదేమిటో వెతకండి" అని ఆజ్ఞాపించాడు. భటులు మంచమంతా వెతికారు. అప్పటికే నల్లి చుట్టుపక్కల లేకుండా పారిపోయింది. తలగడ కింద నక్కి వున్న పేను భటుల చేతికి చిక్కింది. "ఇదే మన రాజుగారిని కుట్టి వుంటుంది" అని వాళ్లు పేనును చంపేశారు. ఈ కథ చెప్పి "కనుక ఎదుటివారి స్వభావం తెలుసుకోకుండా దగ్గరకు చేరనివ్వకూడదు" అన్నాడు దమనకుడు.

"అయితే సంజీవకుని శక్తి ఏంటి? అతను నాకెలా హాని చేయగలడు?" ప్రశ్నించాడు పింగళకుడు. "ఏ శక్తీ లేకపోతే అతను మీతో శతృత్వానికి సిద్ధపడడు. అతని వెనుక రాజద్రోహులైన కాటక, పాటకులు వున్నారు. వాళ్లు కుట్రలు పన్నడంలో ఘటికులు. ఏదో ఒక ఉపాయం ఆలోచించి వుంటారు" అన్నాడు దమనకుడు. "సరే! రేపు సంజీవకుని దగ్గరకుపోయి ఆ వివరాలు అన్నీ తెలుసుకునిరా!" అని ఆజ్ఞాపించాడు పింగళకుడు. "చిత్తం" అంటూ వెనుదిరిగాడు దమనకుడు. సంజీవకుడి దగ్గరకు వెళ్లి విచారంగా ముఖం పెట్టకొని నిలబడ్డాడు. అతణ్ణి చూసి ఎంతో గౌరవంగా ఆహ్వానించాడు సంజీవకుడు.

"దమనకా! ఎందుకు విచారంగా కనిపిస్తున్నావు? నీవారందరూ క్షేమమా?" అని అడిగాడు సంజీవకుడు. "నా క్షేమానికి ఏమీ ప్రమాదం లేదు. ఆ ప్రమాదం మీకు కలగబోతుందనేదే నా విచారం" అన్నాడు దమనకుడు. "నాకు ప్రమాదమా? ఎవరివల్ల?" ఆశ్చర్యంగా అడిగాడు సంజీవకుడు.

"సంజీవకా! నువ్వు మంత్రివైనప్పటి నుండి పింగళకుడు నిన్ను చంపి తినాలని చూస్తున్నాడు" అన్నాడు దమనకుడు. సంజీవకుడు ఉలిక్కిపడ్డాడు. "నన్ను ప్రాణంతో సమానంగా చూసుకుంటున్న పింగళకుడు నన్ను చంపాలనుకున్నాడా? నేను నమ్మను" అన్నాడు సంజీవకుడు.

"నువ్వు పిచ్చివాడివి సంజీవకా? ఎద్దు-మొద్దు అనే సామెతను నిజం చేస్తున్నావు. నది నీరు నిర్మలంగా వుండటం చూసి అక్కడ లోతు వుండదు అనుకునేవాడు ఎంత మూర్ఖుడో .... రాజులు చూపే అభిమానం నిజమని నమ్మే వాడు కూడా అంత మూర్ఖుడు. రాజుల సేవలో సుఖపడినవాడు ఎవ్వడూ లేడు. రాజులకు స్నేహం చేయడం ఎంత తేలికో, ప్రాణం తీయడం కూడా అంతే తేలిక!" అన్నాడు దమనకుడు.

"నేను ఆయనకు ఏ అపకారమూ చేయలేదే. అకారణంగా నన్ను ఎందుకు చంపాలనుకుంటున్నాడు" సంజీవకుడు ప్రశ్నించాడు. "అదా? నువ్వు రాజద్రోహులైన కాటక, పాటకులతో చేతులు కలిపి తన రాజ్యాన్ని అపహరించడానికి కుట్ర పన్నుతున్నట్లు పింగళకుడికి తెలిసిందట. దాంతో మండిపడుతూ నిన్ను చంపాలని నిశ్చయించుకున్నాడు" అంటూ వివరించాడు దమనకుడు.

"అంటే, చెప్పుడు మాటలు విని రాజు ఈ నిర్ణయానికి వచ్చాడా? గుణవంతునితో మెలిగేవాడు గుణవంతుడే అవుతాడు. దుష్టులతో చేరినవాడు సముద్రంలో కలసిన నదీజలంలా అయిపోతాడు. మాయోపాయాలతో జీవించేవారు కాకి, నక్క, పులిలాగా పెద్ద, చిన్న భేదం మరచి మంచి వారికి హాని చేస్తారు" అన్నాడు సంజీవకుడు. ఆ కథేంటో వచ్చేవారం చూద్దాం.

లేడీ డిటెక్టివ్

పాతూరి రాజేంద్రప్రసాద్ వర్మ

వెలుగు రేఖలు విచ్చుకుంటున్నాయి. పూణే నగరం మత్తుగా నిద్రలేస్తోంది. వీధుల్లో మెల్లగా మొదలైంది. రోడ్లమీదకు వచ్చిన వాహనాలు హారన్‌లు సన్నసన్నగా వినిపిస్తున్నాయి. ఊరికి దూరంగా వున్న ఆ కాలనీ ప్రశాంతంగా ఉంది.

రెండు అంతస్తుల ఆ ఇంటిముందు రెండు మూడు వాహనాలు ఆగి వున్నాయి. వచ్చిపోయే సందర్శకుల తాకిడి మొదలు కాలేదు. హీరాలాల్ పేపరు చదువుకుంటున్నాడు.

మెయిన్‌గేట్ వద్దకు ఆమె వచ్చింది. మాసిన బట్టలు.. చంకలో చిన్న సంచి, నుదుటిపైన రూపాయి కాసంత బొట్టు. చూడగానే గౌరవం కలిగేలా అనిపించే అవతారం. "ఎవరు కావాలి?" గేట్‌మెన్ ఆపేశాడు.

"హీరాలాల్ సాబ్‌ను కలవాలి. ఎవరూ లేని ఒంటరిదానిని. ఈ ఇంట్లో పనిమనిషిగా చేయడానికి వచ్చాను." ఆమె జాలిగా చెప్పింది. చెబుతున్నప్పుడు ఆమె మాటల్లో దైన్యం... జాలి వాచ్‌మెన్‌ను కదిలించాయి.

"పనిమినిషి కావాలని ఎవరు చెప్పారు. అయ్యగారికి తెలిస్తే కోప్పడతారు!"

"నా తమ్ముడిలా ఉన్నావు. నాకు ఎవరూ లేరయ్యా! ఇటువంటి పెద్ద మనుషుల ఇంట్లో పనికి కుదిరితే ఉండటానికి ఆసరా దొరుకుతుంది. రోజూ కడుపు కూడా నిండిపోతుంది. నేను అంట్లు తోమగలను... బట్టలు ఉతకగలను... కూరగాయలు తేగలను... వంట చేసి పెట్టగలను..." ఆమె చెబుతున్న మాటలు వాచ్‌మెన్ హృదయంలో కదలికలు పుట్టించాయి.

పక్కనున్న టీ కొట్లోంచి ఛాయ్ తెప్పించి ఆమెకు ఇచ్చాడు. తాగిన తర్వాత లోపల హీరాలాల్ వద్దకు తీసుకెళ్ళి – "అయ్యా! నాకు తెలిసినావిడ. ఎవరూ లేని అనాథ. ఇంట్లో పని చేస్తానని వచ్చింది... కాస్త దయ చూడండయ్యా?" అభ్యర్థించాడు.

హీరాలాల్ పేపరులోంచి బైటికి వచ్చాడు.

ఆమెకు సంబంధించిన వివరాలు అడిగాడు.

ఆమె చీరకట్టు... మాటతీరు... నడవడిక హీరాలాల్‌కు కూడా నచ్చాయి. "ఈ రోజు నుంచే పనిలో చేరు... ఆ మూల ఔట్‌హౌస్ గదిలో ఉండొచ్చు. ఇంటి సంగతులు బైట ఎక్కడా చెప్పడం నాకు ఇష్టం ఉండదు. నీ పనేదో నువ్వు చేసుకోవాలి.... వాచ్‌మెన్ నీ గురించి చెప్పడం వల్ల నువ్వు ఎవరో తెలియకపోయినా పనిలో పెట్టుకుంటున్నాను–" అన్నాడు. తర్వాత పేపరును పక్కన పెట్టి లేచి నిలుచున్నాడు.

వాచ్‌మెన్ ఆమెకు ఇంటి పని అప్పగించడానికి లోపలికి తీసుకువెళ్ళాడు. ఆమె అనుసరించింది.

రెండు అంతస్తుల భవంతిలో ఆమెకు పని ఎక్కువగా ఉండేది. ఆమెతో పాటు మరో ఇద్దరు పని చేసేవారు. వెళ్ళిన వారం పది రోజుల్లోనే ఆమె మిగతా పనివారందరితో కలిసిపోయింది.

పెద్ద ముత్తయిదువ మాదిరిగా ఉండటంతో ఆమె అంటే మిగిలిన వారు ఎంతో అభిమానాన్ని చూపించే వారు. ఆమె అక్కడ పని చేసే వారి అందరి వివరాలు వారి కుటుంబ సంగతులను వివరంగా తెలుసుకుంది.

హీరాలాల్ తరచూ క్యాంపులకు వెళుతూ వ్యాపార వ్యవహారాల్లో నిరంతరం బిజీగా ఉండేవాడు. ఇంటిలో పనిమనిషిగా చేరిన మూడు నెలల కాలంలో యజమానిని కలిసిన సందర్భాలు ఒకటి రెండు కూడా లేవు.

ఇంటిలో బట్టలు ఉతకడానికి రమాబాయి అనే వృద్ధురాలు ఉండేది. ఆమెతో సన్నిహితం బాగా పెరిగిన తర్వాత ఒక రోజు – "జానకి ఎలా చనిపోయింది?" అని అడిగింది.

జానకి పేరు వినగానే రమాబాయి భయపడిపోయింది. మొదట ఏమీ మాట్లాడలేదు. "జానకి ఎలా తెలుసు?" ప్రశ్నించింది.

రమాబాయి గాబరా చూసి ఆమె కాస్త తగ్గి – "జానకి ఎవరో నాకు తెలియదు. ఈ ఇంటిలో పని మనిషిగా చేస్తూ చనిపోయిందని విన్నాను. నీకు వివరాలేమైనా తెలుసునేమోనని అడిగాను అంతే!" అంది ఆమె.

అక్కడితో ఆ విషయం ఆగిపోయింది.

మరో వారం రోజుల తర్వాత రమాబాయి దగ్గరికి వచ్చి – "నువ్వు అడిగావు జానకి గూర్చి. ఆమె చనిపోలేదు.. అయ్యగారు కోపంతో కొడితే పట్టు తప్పి డాబా పై నుంచి పడిపోయింది. ఆసుపత్రిలో చేర్పించారు. అయినా ఫలితం లేకపోయింది."

"ఈ విషయం బైటికి రాలేదా?"

"అయ్యగారికి బాగా పలుకుబడి కదా? జారిపడి చనిపోయిందని అందరికీ చెప్పించారు. జానకి ఇంట్లో వాళ్ళకు కూడా ఎంతో ముట్టజెప్పారని అంటారు!"

"జానకి హత్య చేయబడిందన్నమాట!"

"అంటే?"

"ఇతరుల ప్రోద్బలంతో జరిగింది కాబట్టి... ప్రమాదవశాత్తు జరగలేదు కాబట్టి దీనిని హత్యే అంటారు?"

"ఇవన్నీ నీకెలా తెలుసు?" రమాబాయి అడిగింది. "ఎవరో చెప్పగా విన్నాను లే! అయ్యగారు కొట్టినట్లు ఎవరెవరు చూశారు?" "ఇంట్లో అందరూ చూశారు!"

రమాబాయి చెప్పిన వ్యక్తులలో ఒకరు పని మానివేసి కూరగాయల కొట్టు పెట్టుకున్నారు. మిగిలిన వారిని అడిగితే వారు కూడా రమాబాయి చెప్పినట్లే చెప్పారు. అంటే జానకి కచ్చితంగా హత్య కావించబడిందన్నమాట... ఆమె నిర్ధారించుకుంది.

అప్పటికి పనిమనిషిగా చేరి ఆరునెలలైంది.

తను విన్న విషయాలను రికార్డు చేసింది. జానకి మృతి కేసులో హత్య కేసుగా నిర్ధారణ కావడానికి అన్ని వివరాలు సేకరించింది.

ముంబై పోలీసుల రికార్డుల్లో సాధారణ కేసుగా నమోదై రికార్డుల్లో చిరిగిపోయిన జానకి మృతి కేసు కొత్త మలుపు తిరగడంతో పోలీసులు కూడా ఆశ్చర్యపోయారు. లభించిన ఆధారాలను బట్టి హీరాలాల్‌పై హత్య కేసు నమోదు చేసి కేసును తిరగతోడారు.

ఆమె చేసిన ప్రయత్నాన్ని పలువురు అభినందించారు. దిగువస్థాయి కుటుంబానికి చెందిన ఏ ఆధారం లేని పని మనిషి మృతిని కొత్తమలుపు తిప్పడానికి, వాస్తవాలు వెలికి తీయడానికి పనిమనిషి అవతారం ఎత్తి ఆరు నెలలు పరిశోధన చేసిన ఆమె కృషి అందర్నీ ఆశ్చర్యానికి లోను చేసింది.

ఆమె లేడీ డిటెక్టివ్ రజనీ పండిట్.

* * *

ముంబైకి చెందిన రజనీ పండిట్ చిన్నతనం నుంచి సాహస కృత్యాలంటే ఎంతో ఇష్టంగా పెరిగింది. ఆమె తల్లిదండ్రులు పోలీసు ఆఫీసర్‌గా ఆమెను చూడాలని అనుకున్నారు.

అయితే పరిశోధనా రంగం పట్ల ఆమె మొగ్గు చూపించారు. చిన్నతనంలో చదివిన డిటెక్టివ్ నవలలు, అపరాధ పరిశోధనా పుస్తకాలు రజనీ పండిట్‌ను డిటెక్టివ్‌గా మార్చాయి.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందు చిన్న ఆఫీసుతో కార్యక్రమాలను మొదలుపెట్టింది. పోలీసు అధికారులతో తన కార్యక్రమాలకు ఆమోదముద్ర వేయించింది. ఆ తర్వాత తన కార్యక్రమాలను మొదలు పెట్టింది.

చాలా మంది డిటెక్టివ్ బోర్డుతో వున్న కార్యాలయాన్ని అందులో వంటరిగా కూర్చుని పుస్తకాలు చదువుకొంటున్న రజనీ పండిట్‌ను చూసి నవ్వుకొనే వారు. ఈ అమ్మాయికి బుద్ధిలేదు అనుకొనే వారు. క్రమక్రమంగా డిటెక్టివ్ ఏజెన్సీ అందరి దృష్టినీ ఆకర్షించింది.

రజనీ పండిట్ స్థానిక దినపత్రికల్లో తన డిటెక్టివ్ సంస్థ గూర్చి చిన్న చిన్న ప్రకటనలు వేయించింది. మొదట అవి ఎవరినీ ఆకర్షించేవి కావు. భార్యలపై అనుమానం వున్నవారు, భర్తల చెడు తిరుగుళ్ళపై అనుమానం కలిగినవారు.... దొంగతనాల్లో వస్తువులను కోల్పోయిన వారు రజనీని సంప్రదించేవారు. ఆమె రంగంలో దిగి ఒకటి రెండు రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరించి అందుకు కారణాలను కనిపెట్టేది. క్రమక్రమంగా ఆమె పరిశోధనలకు గుర్తింపు వచ్చింది.

ముంబైలో కొన్ని వ్యాపార సంస్థలు తమ వ్యాపారాభివృద్ధికి అడ్డుగోడలుగా వున్న పరిస్థితులను అధ్యయనం చేయమని రజనీ పండిట్‌కు ఎసైన్‌మెంట్లు అప్పగించేవి. వాటిని ఆమె సమర్థవంతంగా పరిష్కరించింది.

కుమార్తె పరిశోధనా జిజ్ఞాస తల్లిదండ్రులకు ఎంతో ఆనందం కలిగించేది.

* * *

బాంకులో ప్రవేశించిన ఇద్దరు దొంగలు క్యాషియర్‌ను బెదిరించి అయిదు లక్షల రూపాయల నగదు ఎత్తుకుపోయారు.

ఈ సంఘటనలో పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. గాలింపు మొదలు పెట్టారు.

నగరం నుంచి బైటికి వెళ్ళే జాతీయ రహదారులన్నీ పోలీసులు దిగ్బంధనం చేశారు. రజనీ పండిట్ కూడా నేరస్తుల వేట ప్రారంభించింది.

అజ్ఞాత వ్యక్తి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆమె మురికి వాడలోకి ప్రవేశించింది. దొంగలిద్దరూ ఇళ్ళముందు దర్జాగా కూర్చున్నారు.

సాయంత్రం కావడంతో చిరుచీకటి ప్రవేశిస్తోంది. చీకటితో పాటు రజనీ ఆ వీధిలో ప్రవేశించింది.

దొంగలు ఇద్దర్నీ పట్టుకోవాలి. పట్టుకోవడానికి వచ్చానని తెలిస్తే పారిపోతారు. కాని వారిని గమనించాలి. రజనీ రకరకాలుగా ఆలోచించింది.

రోడ్డుపైన వున్న రాయిని కావాలనే గట్టిగా తన్ని- 'అబ్బా!' అంటూ కూలబడిపోయింది. కూర్చున్న వెంటనే బ్లేడుతో బొటనవేలిని కోసుకుంది. వెంటనే రక్తం బొటబొట కారిపోయింది. ఎదురింటి అరుగుపైన ఇద్దరు దొంగలు కూర్చున్నారు. కాలినుంచి కారిన రక్తం రోడ్డుపైన ధార కట్టింది.

రోడ్డుపైనే కూర్చుండిపోయి దొంగలిద్దరిని గమనిస్తోంది. ఇంతలో పక్కింటిలో ఉన్న అమ్మాయి దగ్గరికి వచ్చి "అయ్యో ఎక్కువ రక్తం పోయిందే... కట్టు కట్టాలి..." అంటూ లోపలికి వెళ్ళింది.

దొంగలిద్దరూ గమనించనట్లు తమ పనిలో తాము ఉన్నారు. రజనీ పండిట్ కుంటుకుంటూ మెల్లగా వారి వద్దకు వెళ్ళింది. ఆమె పరిస్థితిని వారు ఏ మాత్రం అనుమానించలేదు. వారి అప్రమత్తత చూసి ఇద్దరి కాలర్లు పట్టుకుని "చోర్... చోర్" అంటు గట్టిగా అరిచింది.

ఈ హఠాత్ సంఘటన వారు ఊహించనిది.

దొంగలిద్దరూ దొరికిపోయారు. పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి చోరీ అయిన నగదును రికవరీ కూడా చేశారు.

రజనీ పండిట్ తనకు తానుగా కాలికి చేసుకున్న గాయం మాని రికవరీ కావడానికి పది రోజులు పట్టింది.

* * *

లేడీ డిటెక్టివ్ అభినందన సభ.

చాలా మంది హాజరయ్యారు.

పోలీసు అధికారులు, రాజకీయ నాయకులు, పురప్రముఖులు అందరూ వచ్చారు. రజనీ పండిట్ తల్లిదండ్రులు కూడా విచ్చేశారు.

లేడీ డిటెక్టివ్‌గా రజనీ పండిట్ చేసిన కృషిని వక్తలు వివరిస్తున్నారు. ఒంటరిగా డిటెక్టివ్ ఏజెన్సీని ప్రారంభించి ఎనిమిది మందిసభ్యుల బృందంతో విజయవంతంగా ఆమె కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అమెరికా, మధ్య ప్రాచ్య దేశాల్లో కూడా ఎంతోమంది క్లయింట్లను సంపాదించుకున్న ఆమె కృషి ఎంతో గొప్పదని నిర్వాహకులు పేర్కొన్నారు. మరో వ్యక్తి రజనీ పండిట్ ఇంతవరకూ పోలీసులకు ఛాలెంజిగా వున్న ఏ ఏ కేసుల్ని ఏ విధంగా పరిశోధన చేసి పరిష్కరించారో వివరించారు.

చివరగా రజనీ పండిట్‌కు మాట్లాడే అవకాశం వచ్చింది. మైకు ముందుకు వెళ్ళి గొంతును సవరించుకుంది. "స్త్రీలు తమకు నచ్చిన వృత్తిని ఎన్నుకోవాలి. ప్రారంభంలో అడ్డంకులు ఏర్పడతాయి. వాటిని అధిగమించాలి. నేరం చేసిన వ్యక్తి తప్పించుకోలేడు. ఎక్కడో ఏదో తప్పు చేస్తాడు. ఆ తప్పు అతడ్ని పట్టిస్తుంది. భారతదేశంలో డిటెక్టివ్‌లుగా పని చేసే వారికి లైసెన్సులు ఇవ్వాలి. అలా ఇచ్చినట్లయితే వారు పోలీసుల కంటే బాగా పని చేయగలుగుతారు" అంది.

ఆమె మాటలకు అందరూ చప్పట్లు కొట్టారు.

మళ్ళీ గొంతు సవరించుకుంది – "భయం అనేది ఎవరికీ ఉండకూడదు... మహిళలకు అసలు ఉండకూడదు. అందుకే నా నినాదం "జో డర్ గయాతో మర్ గయా" (ఎవరైతే భయపడతారో వారు చనిపోయినట్టే లెక్క). ఇది ప్రతి మహిళ నినాదం కావాలి" చెప్పుకుపోతూనే ఉంది. రజనీ పండిట్ తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనంద బాష్పాలు ఉబికి బైటికి వచ్చాయి.

★

వెల్లువ

(10వ పేజీ తరువాయి)

అవసరం లేదు. కుక్కలు మొరుగుతున్నాయని జంగం పట్టించుకుంటాడా? నా ఉద్యోగం సంగతి మీరేం చూడనక్కరలేదు. ఎలా సంపాదించుకోవాలో నాకు తెలుసు" కనక నోరునెత్తిన పెట్టుకొని గల, గలా అరిచేసరికి చుట్టుపక్కల వాళ్ళంతా కుతూహలంగా చూడసాగారు.

కనక ప్రవర్తనతో తలకొట్టేసినంతగా సిగ్గుపడుతూ "చూడమ్మా! పిల్లలూ, నువ్వూ ఆగమవుతారేమోనని చెబుతున్నా, ఆ తర్వాత నీ ఇష్టం" అంటూ తలవంచుకొని వెళ్ళిపోయాడు.

ఈ విషయం తెలిసిన భూపతి "శభాష్ కనకా! ఆ సత్యం గాడిక జన్మలో నీ జోలికి రాడు" అన్నాడు.

"అది సరేగాని, అసలు నా ఉద్యోగం సంగతేం చేశావ్! ఇంకెన్ని రోజులు?" నిలదీసింది కనక.

"నాకా మాత్రం తెలియదా? ఈ మధ్య ఆఫీస్‌లో టైపిస్టొకమ్మాయి వి.ఆర్.ఎస్. పెట్టి వెళ్ళిపోయింది. ఆపోస్టు ఇప్పిద్దామంటే, నీకేమో చదువు రాదాయె. గట్టిగా అడిగితే ఏ స్వీపర్ పోస్టో ఇస్తారు. కాకుంటే ఇంత బతుకూ బతికి ఇంటెనక చచ్చినట్టు నిన్ను స్వీపర్‌గా వేయిస్తే నా ప్రెస్టేజి ఏం గావాలి? మాటల్ని మధ్యలోనే కట్ చేసి ఆలోచిస్తున్నట్టు నటించసాగాడు భూపతి.

"మరెలాగా?" కనక.

"ఏదో ఒకటి చెయ్యాలి" భూపతి.

"ఏంజేద్దాం?" కనక.

"ఆ పోస్టేదో మీ పెద్దమ్మాయికిప్పిస్తేపోలే.." గాల్లోకి బాణం వదిలాడు భూపతి.

"మరి దాని చదువు. అటిటుగాకుండా పోదు?" ఆలోచిస్తూ అంది కనక.

"ఆచదువుదేముంది? జాబ్ చేస్కుంటు చదువుకోకూడదా? అయినా నాకు తెలియకడుగుతా చదువుకునేదెందుకు? ఉద్యోగం కోసమే గదా? మరి ఆ ఉద్యోగమే ఇప్పిస్తానంటుంటే ఇంకా చదువు, చట్టుబండలంటు ఆలోచిస్తావేంటి?" వివరించాడు భూపతి.

"అమ్మాయికి చెప్పిచూస్తా" అంది కనక.

* * *

"అమ్మా! ఇంకొక్క ఏడాదాగితే డిగ్రీ అయిపోద్ది. ఆ తర్వాత బి.ఇడి. చేస్తే గవర్నమెంట్ టీచర్ అవ్వచ్చు. ఈ ప్రైవేటు జాబులు ఎప్పుడుంటాయో, ఎప్పుడు పోతాయో తెలియదు" తల్లి చెప్పిన ఉద్యోగం సంగతి విని తిరస్కారంగా అంది కనక పెద్ద కూతురు రాణి.

"ముద్దొచ్చినప్పుడే చంకెక్కాలి. జాబిస్తనంటే వద్దంటవేంది? దేశం మీద ఎంతమంది జాబ్‌జేస్కుంటు చదువుకోవట్లే! నువ్వు కూడా అట్లనే చెయ్యి కావాలంటే" అంది కనక.

"ఎంత అమాయకంగా ఉండే అమ్మ, ఎంత తెలివిమీరిపోయిందీ!" తల్లికేసి ఆశ్చర్యంగా చూసింది రాణి తన్లో తాను అనుకుంటు.

"ఏంటలా?! అడిగిందానికి బదులు చెప్పకుండా కళ్ళప్పగించి చూస్తావ్?" అంటూ కూతుర్ని కసురుకుంది కనక.

"చెప్పాను కదా, నేను చదువుకుంటాను" మళ్ళీ అంది రాణి.

"చెప్పేదర్థం చేసుకోవేం?" కనక.

"----" చెప్పులేసుకొని విసురుగా కాలేజీకి వెళ్ళిపోయింది రాణి.

వారం, పది రోజులు తల్లీ, కూతుళ్ళ మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాల తర్వాత తల్లే నెగ్గింది.

కూతురి అంగీకారం భూపతికి తెలియజేసింది కనక.

భూపతి బుర్ర పాదరసంలా కదిలింది.

* * *

వారం తర్వాత.

"కనకా! హైదరాబాద్ నుంచి చైర్మన్‌గారొచ్చారు. ఉద్యోగం సంగతి అతనితో మాట్లాడాను. మొదట్లో కాదన్నా చివరికి నా మొహం చూసి ఓకే అన్నారు.

సాయంత్రం ఆరుగంటలకు అమ్మాయిని తీసుకొని గెస్ట్‌హౌస్ దగ్గరకు రా, నేనూ అక్కడే ఉంటా" అంటూ మరో మాటకు అవకాశం ఇవ్వకుండా వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు భూపతి.

గొర్రె కసాయినే కదా నమ్ముతుంది – అనాదిగా అదే కదా జరుగుతుంది.

ఆ సాయంత్రం నాల్గింటల నుండి కంపెనీ గెస్ట్‌హౌస్‌లో సీసాలు, సిగరెట్లు, ప్లేట్లు, ఖాళీ చేస్తూ కూర్చున్నారు భూపతి, చైర్మన్లు.

సరిగ్గా ఆరు గంటలకు గెస్ట్‌హౌస్ దగ్గరకు చేరుకున్న తల్లీ కూతుళ్ళను చైర్మన్ రూమ్ ముందు వదిలి, వాళ్ళవైపు అదోలా చూస్తూ వెళ్ళిపోయాడు సెక్యూరిటీ గార్డ్.

వాళ్ళను చూసిన భూపతి ముఖం మీద నవ్వు పులుముకుంటు రండి! రండి! మీ కోసమే ఎదురు చూస్తున్నాం మార్దవంగా అన్నాడు.

బెదురు, బెదురుగా లోపలికొచ్చిన తల్లీ కూతుళ్ళను ఛైర్మన్‌కి పరిచయం చేసి "అమ్మాయి రాణి! ఇంటర్వ్యూ జరిగేటప్పుడు ఎవ్వరూ ఉండకూడదు. నేనూ మీ అమ్మా బైటే వుంటాం. నువ్వేం భయపడకుండా అడిగిన వాటికి సమాధానాలు చెప్పమ్మా! అంటు కనకను తీసుకొని బైటికొచ్చి తలుపులేశాడు భూపతి.

గదిలోని వాతావరణాన్ని, కొండచిలువలాంటి ఛైర్మన్ని తలుచుకుంటూ మూసిన తలుపుల వైపు, భూపతి వైపు అయోమయంగా చూడసాగింది కనక.

తోడేలు వేటకు బలవుతూ లోపల పిల్లమేక.

నమ్మి చెడ్డందుకు సిగ్గుతో చచ్చిపోతూ వెలుపల తల్లిమేక, పేగులు తెగేలా ఆక్రోశించినా లాభం లేకపోయింది...

సరిగ్గా అప్పుడు వినిపించింది సముద్రపు హోరులాంటి ధ్వని క్రమంగా దగ్గరవుతూ...

"ఏంటా!? అని తలతిప్పి చూసిన భూపతికి గెస్ట్‌హౌస్ గేట్లు తోసుకుని వరదలా దూసుకొస్తున్న కాలనీ ఆడవాళ్ళు కన్పించేసరికి, భయంతో కనుగుడ్లు పెద్దవై, వళ్ళంతా చెమటలు పడుతుంటే గోడదూకి పారిపోతుండగా పట్టుకున్న కనక "త్వరగా రండీ! త్వరగా రండీ..." అంటు అరుస్తుండగానే చుట్టుముట్టిన ఆడవాళ్ళు "మనకెందుకే అని ఊర్కుంటుంటే, చివరికి పిల్లబతుకూ నాశనం చెయ్యాలని చూస్తావా..." అంటూ దొరికిన వాళ్ళు దొరికినట్టు భూపతి శరీరాన్ని చపాతీ పిండిలా ముద్ద చేసి పడేశారు.

ఇంకొంత మంది ఆడవాళ్ళు ఛైర్మన్ ఉన్న గది తలుపులు తోసుకుని లోపల ప్రవేశించే సరికి, అతను పాతరగుంటలో పడ్డ గజ్జికుక్కలా వాళ్ళ చేతికి దొరికిపొయ్యి మొత్తుకోసాగాడు.

విషయాన్ని ఆడవాళ్ళకందించిన సెక్యూరిటీ గార్డు మౌనంగా చూస్తూ ఉండిపోయాడు.

★

సన్మాన క్షోభ....

లక్ష్మి

ఎవరైనా-

ఘనకార్యం చేస్తే...

సెభాషంటాం!

ఇందులో ఆడామగా తేడాలుండవు. ఘనకార్యం ఎవరు చేసినా సెభాషనే అంటాం!

ఈ సెభాషనే మాట కొంచెం పెద్దస్థాయిలో వినిపించే ఏర్పాటుకి సన్మానమని పేరు పెడతారు!

సన్మానం చేయాలనుకున్న మనిషిని-

ఎవరికి వారు విడివిడిగా కలుసుకుని సెభాషని మెచ్చుకుంటే ఆ సెభాషులన్నీ గాల్లో కలిసిపోతాయి!

ఘనకార్యం చేసిన మనిషికి తృప్తిగా వుండదు!

అట్లా కాకుండా-

సెభాషనే వాళ్ళంతా ఒకచోట సమావేశమై మంగళ వాయిద్యాలు... పూలదండలు... పట్టు శాలువాలూ... సన్మాన పత్రాలూ వగైరా హంగులతో అందరూ ఒకేసారి సెభాషంటె ఆ గోలతో సన్మానితురాలు గానీ సన్మానితుడు గానీ పులకించిపోతారు!

ఫొటోగ్రాఫరొస్తాడు. ఫొటోలు తీస్తాడు! పేపరు వాళ్ళు వస్తారు. ఆ వార్తనీ ఫొటోనీ పత్రికల్లో ప్రచురిస్తారు! ఈ అల్లరి చరిత్రలో రికార్డవుతుంది!

ఏతావాతా - సన్మానం జరిగిన వ్యక్తి చరిత్రకెక్కడం జరుగుతుంది. జరిపించిన వారు ఒక మంచి పని చేసేమని తృప్తి పడతారు. టూకీగా ఇదీ సన్మానం యొక్క ఫిలాసఫీ!

సన్మానాలు రెండు రకాలు!

ఒకటి చేసేది... రెండు చేయించుకునేది!

చేసిన సన్మానాలు ఎంత చిన్నవైనా- చెప్పుకోడానికి ఎంతో హోదాగా వుంటాయి. మనసుకి హాయిగా వుంటాయి!

ఎవరూ చేయకపోతే-

మన ఖర్చుతో మనమే చేయించుకోడం రెండో పద్ధతి!

ఈ రెండో పద్ధతి సన్మానంలో సుఖముండదు. చేతి చమురు ఖర్చయినందుకు కొంత విచారంగా వుంటుంది. ఎవరో చేసేరని అబద్ధం చెబుతున్నప్పుడు ఆత్మారాముడు కోప్పడుతూ వుంటాడు!

అయినా-

మెజారిటీ సన్మానాలు రెండో తరగతివేనని మొన్నామధ్య తాయారమ్మ చెప్పింది. అంతటితో ఆగలేదు. ఎవరెవరు ఎప్పుడెప్పుడు ఈ రెండో తరగతి సన్మానాలు చేయించుకున్నారో వివరాలు కూడా చెప్పింది.

కొందరు సన్మానితులు -

తమ సన్మాన సభలో సన్నాయి నొక్కులు నొక్కుతారు. ఫలానా రంగంలో నేను చాలా చిన్నవాడినంటారు. నాకెందుకు సన్మానం చేస్తున్నారో తెలీడం లేదంటారు!

అవన్నీ ఉత్తుత్తి మాటలు!

తనకు సన్మానం చేసేంత వరకు ప్రాణాలు తీసి - ఆ సభలో ఈ తరహా నొక్కుల్తో అతితెలివి ప్రదర్శిస్తారు!

మరికొందరు-

తనకి సన్మానం చేసిన వాళ్ళని ఆఫ్టరాల్‌గా తీసిపారేసి - తనలాటి వాళ్ళకి సన్మానం చేయడమే వాళ్ళ అదృష్టమనే తరహాలో వేదికమీద పేట్రేగి పోతుంటారు!

సన్మాన సభ తాలూకు వక్తల్లో -

కొందరు అసూయపరులుంటారు!

తమకంటే తక్కువ స్థాయిలో వున్న మనిషికి సన్మానం జరిగి పోతున్నందుకు మనసులో కుళ్ళుకుపోతుంటారు!

మాటల్లో మాత్రం-

అభినందన వర్షాన్ని కురిపిస్తుంటారు!

పనిలో పనిగా -

తమ గురించి కూడా గొప్పగా చెప్పుకుంటారు!

ఆ విన్యాసం టూకీగా ఇట్లా సాగుతుంది...

మీరు సన్మానిస్తున్న ఈ సత్యవతి పాడతారని నాకు తెలీదు మొన్న మా పక్కింటో జరిగిన పేరంటానికి వెళ్ళేను. అక్కడ ఈమె పాడిన 'మంగళహారతి' విన్నాను. అంత చక్కగా పాడతారని నాకు ముందే తెలుస్తే - గత నెల బెంగుళూరు తెలుగు సభలకు తీసుకెళ్ళేదాన్ని. అక్కడ నా పాట కచేరికి - ప్రార్థన గీతం ఈ సత్యవతి చేతనే పాడించేదాన్ని అంటారు.

కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచయిత్రికి - మా మహిళా సంఘం సత్కార సభ ఏర్పాటు చేసింది!

ఆ సభ అన్నపూర్ణమ్మగారి అధ్యక్షతన జరిగింది!

రచయిత్రికి ఏం బహుమతి యిస్తున్నారని అన్నపూర్ణమ్మ అడిగేరు. సింపులుగా దండతో సత్కరిస్తున్నామని సభా నిర్వాహకులు చెప్పేరు!

సభకి అధ్యక్షత వహిస్తున్నాను గదా- నాకు మాత్రం పట్టు శాలువా కప్పమని అన్నపూర్ణమ్మ ఆర్డరువేసేరు! ఖర్చెక్కువవుతుందని నిర్వాహకులు నసుగుతున్నప్పుడు - శాలువా ఖర్చు నేనే భరిస్తానని అన్నపూర్ణమ్మ భరోసా ఇచ్చి వేదిక ఎక్కేరు!

సన్మానం దండతో సరిపెట్టి -

అన్నపూర్ణమ్మకి శాలువా కప్పి పుణ్యం కట్టుకున్నారు నిర్వాహకులు! ★

నకిలీ సాహస కృత్యాలు

అంపశయ్య నవీన్

ఈ వార్త చూశావా?

"ఏ వార్త?"

"పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉంటున్న మన సైనికులు ఏం చేశారో చూశావా?"

"ఏం చేశారు?"

"పాకిస్తాన్‌తో యుద్ధం జరగకుండానే జరిగినట్టు... పాకిస్తాన్ సైనికుల్ని చంపకుండానే చంపినట్టు నాటకాలాడి, ఆ నాటకాల్ని వీడియో ఫిల్ములుగా తీసి మనల్ని నమ్మించడానికి ప్రయత్నించారట!"

"నువ్వు చెబుతున్నదేమిటో నాకు బొత్తిగా అర్థం కావడం లేదు."

"అర్థం కాకపోవడానికి దేమన్నా అల్‌జీబ్రానా? అర్థశాస్త్రమా? పాకిస్తాన్‌కూ మనకూ కాశ్మీర్‌లోని సరిహద్దు రేఖ దగ్గర ఎప్పుడూ కాల్పులు జరుగుతూనే ఉంటాయి. ముఖ్యంగా సియాచిన్ గ్లేసియర్ అని... హిమాలయ పర్వత శిఖరాల్లో ఉండే ఓ ప్రాంతం... ఒకప్పుడిక్కడో నది ప్రవహిస్తుండేదట... అది తర్వాత గడ్డకట్టుకుపోయి "గ్లేసియర్" మారిపోయింది. ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకోవాలని పాకిస్తాన్ సైనికులు చాలాసార్లు ప్రయత్నించారు. వాళ్ళ దాడుల్ని మన సైనికులు చాలాసార్లు తిప్పికొట్టారు.. ఈ మధ్యన కొంతకాలంగా సియాచిన్ గ్లేసియర్ కాస్త ప్రశాంతంగానే ఉంది. అయితే సైనికాధికారులేం చేశారంటే పాకిస్తాన్ సైనికులు తమ మీద మరోసారి దాడి చేశారనీ... దాన్ని మేం తిప్పికొట్టామనీ... ఓ రెండువందల మంది పాకిస్తాన్ సైనికుల్ని కాల్చి చంపామనీ ప్రకటిస్తూ వాళ్ళచేత చంపబడిన పాకిస్తాన్ సైనికుల శవాల్ని వీడియో ఫిల్ముల్లో చూపించారట... మన ప్రభుత్వాధికారులు ఇదంతా నిజమే అనుకొని ఇంత ఘనకార్యం చేసిన మన సైనికాధికారులకు పరమవీర చక్ర, వీరచక్ర లాంటి అత్యున్నత అవార్డుల్ని ఇవ్వాలనుకున్నారట. అయితే వాళ్ళు పాకిస్తాన్ సైనికుల్ని చంపలేదనీ, మన భారత సైనికుల్నే చనిపోయినట్టుగా నటిస్తూ పడుకోమని చెప్పి ఆ దృశ్యాలనే వీడియో ఫిల్ములుగా తీశారనీ.. మన భూభాగంలోని బంకర్లనే ధ్వంసం చేసి అవి పాకిస్తాన్ సైనికులు నిర్మించుకున్న బంకర్లుగా చూపించారనీ తెలిసిపోయింది.

"ఎలా తెలిసింది?'

"ఇవ్వాళ్ళ మీడియా చాలా యాక్టివ్ అయిపోయింది కదా... ప్రపంచంలో ఎక్కడ ఏం జరిగినా టీవీ ఛానళ్ళ వాళ్ళు బయటపెట్టేస్తున్నారు... మొన్న ఇరాక్‌లో ఏం జరిగిందో చూశాం కదా.. ఇరాక్ మీద దురాక్రమణ చేసి, ఆ దేశాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్న అమెరికా అక్కడ ఎన్ని అఘాయిత్యాలు చేస్తున్నదో మీడియో కనిపెట్టేస్తున్నది. సద్దాం హుస్సేన్ తరఫున యుద్ధం చేసిన ఇరాక్ సైనికుల్ని అమెరికన్లు యుద్ధ ఖైదీలుగా పట్టుకొని వాళ్ళను ఎన్ని చిత్రహింసలకు గురి చేశారో, ఎన్ని లైంగిక అవమానాలకు గురి చేశారో చూపించే చిత్రాలను టీవీ ఛానెళ్ళు చూపించాయి. ఇందుగలడందులేడని సందేహం వలదు అన్నట్టుగా ఇవ్వాళ్ళ మీడియాలేని ప్రదేశమంటూ లేదేమో... ఎంతో రహస్యంగా, ఎంతో పకడ్బంధీగా జరుగుతున్న గూడుపుఠాణీలను, కుట్రలనూ, అక్రమాలనూ ఇవ్వాళ మీడియా ప్రజలముందు పెడుతున్నది..."

"ఇదివరకు నాకు సైనికులంటే ఎంతో గౌరవముండేది. దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి వాళ్ళు తమ ప్రాణాలనే త్యాగం చేస్తున్నారనుకునే వాన్ని... వాళ్ళకు మనమంతా ఎంతో రుణపడి వున్నామనుకునే వాడిని. అలాంటి సైనికులు ఇంతగా దిగజారిపోవడానికి కారణమేమిటంటావు?"

"ఇవ్వాళ సమాజంలోని అన్ని వ్యవస్థలూ, అన్ని విలువలూ పతనమైపోతున్నట్టే సైనికులనే వ్యవస్థ కూడా దిగజారిపోతున్నది... ఇవ్వాళ్ళ ప్రతివాడికీ చాలా సత్వరమైన విజయాలు కావాలి. పేరు ప్రఖ్యాతులు కావాలి. అవార్డులూ, రివార్డులూ కావాలి. మన సైనికాధికారులు మన సైనికుల చేత ఇంత నీచమైన పని ఎందుకు చేయించారంటే అవార్డుల కోసమంట... పరమవీరచక్ర, వీరచక్ర లాంటి అవార్డులను యుద్ధాల్లో గొప్పసాహస కృత్యాలు చేసిన సైనికులకిస్తారు. అలాంటి సాహసకృత్యాలు చేయకుండానే ఆ అవార్డులు కొట్టెయ్యాలని కొందరు సైనికాధికారుల ప్రయత్నం... అందుకే ఇలాంటి నకిలీ సాహసకృత్యాల్ని సృష్టించడం... అవార్డుల్ని పొందటం..."

"ఇదంతా చూస్తాంటే ఏది నిజమో, ఏది అబద్ధమో... దేన్ని నమ్మాలో... దేన్ని నమ్మొద్దో తెలియడం లేదు.... మనిషిలో ఇంత స్వార్థం పెరిగిపోవడం చూస్తోంటే మానవత్వం, మంచితనం అనే వాటి మీద నమ్మకం సడలుతుందేమోనని ఆందోళన కలుగుతోంది."

★

ఆర్థ్రైటిస్‌ను అధిగమించేందుకు వ్యాయామం



వేగవంతమైన జీవనశైలి కారణంగా వచ్చే వ్యాధి 'ఆర్థ్రైటిస్'. రుమాటిక్ వ్యాధులలో దాదాపు వంద రకాలున్నాయి. కీళ్ళు, కండరాలు, లిగమెంట్లు, ఎముకలు వంటి ఇతర శరీర భాగాలలో నొప్పి, బిగపట్టడం, వాపు వంటి సమస్యలు ఏర్పడతాయి. కొన్ని రకాల ఆర్థ్రైటిస్ శరీర అంతర్భాగాలతో సహా పలు భాగాలను ప్రభావితం చేయవచ్చు.



ఆర్థ్రైటిస్ పదానికి అసలు అర్థం కీళ్ళ వద్ద కణజాలం గాయపడటం వల్ల లేదా వ్యాధి వల్ల వాపు, నొప్పి, ఎరుపుదనం ఏర్పడటం. కొన్ని రకాల రుమాటిక్ వ్యాధులను అనుసంధాన కణజాల వ్యాధులు అంటారు. ఎందుకంటే ఈ వ్యాధి శరీరంలో అనుసంధాన కణజాలాన్ని ప్రభావితం చేస్తుంది. ఇతర రకాలను ఆటో ఇమ్యూన్ వ్యాధులు అంటారు. ఇందులో ఇమ్యూన్ వ్యవస్థ శరీరపు ఆరోగ్యకర కణజాలాన్ని ప్రభావితం చేస్తుంది. ఆస్టియో ఆర్థ్రైటిస్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, ఫైబ్రోమియాల్జియా, స్క్లెరోడెర్మా, జువనైల్ రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, ఆంకిలోజింగ్ స్పాండిలైటిస్, గౌట్ వంటివి రుమాటిక్ వ్యాధులలో కొన్ని.

వ్యాయామం

శరీర వ్యాయామం ఆర్థ్రైటిస్ వ్యాధి పీడితులకు పలు రకాలుగా ఉపకరిస్తుంది. వ్యాయామం కీళ్ళ నొప్పులను తగ్గిస్తుంది. బిగుసుకోవడాన్ని తగ్గించి కదలికను సులభతరం చేస్తుంది. కండరాల పటిష్టత, గుండె పరిస్థితి మెరుగువడతాయి. బరువు తగ్గేందుకు సహకరించి మొత్తం మీద ఆరోగ్యం మెరుగుదలకు దారి తీస్తుంది.

ఆర్థ్రైటిస్‌కు అందించే సమగ్ర చికిత్సా ప్రణాళికలో వ్యాయామం ఒకటి. ఈ వ్యాధి

పీడితులకు మూడు రకాల వ్యాయామం ఉత్తమమైనది. నృత్యం వంటి కదలిక ఎక్కువ ఉండే వ్యాయామం కీళ్ళ కదలికలను సాధారణ స్థితికి తీసుకు వస్తుంది. పటిష్టమైన కండరాలు ఆర్థ్రైటిస్ ప్రభావిత కీలుకు రక్షణ కల్పిస్తాయి. కాబట్టి కండరాలను పటిష్టం చేసే వ్యాయామం మంచిది. కీళ్ళలో తీవ్రమైన నొప్పి, వాపు లేనంతవరకు రోజు విడిచి రోజు ఈ వ్యాయామం చేయడం మంచిది. సైకిల్ తొక్కడం వంటి ఏరోబిక్ వల్ల శరీర బరువూ అదుపులో ఉంటుంది. మొత్తం మీద పరిస్థితిని మెరుగుపరుస్తుంది. ఆర్థ్రైటిస్‌తో బాధపడేవారికి బరువు నియంత్రణ అనేది అత్యంత కీలకం. ఎందుకంటే, బరువు పెరగడం అంటే కొన్ని కీళ్ళమీద అధిక ఒత్తిడి పెట్టడమే. చాలా వరకు హెల్త్ క్లబ్‌లు, సామాజిక కేంద్రాలు శారీరక పరిమితులు ఉన్న వారి కోసం వ్యాయామం కార్యక్రమాలు అందిస్తున్నాయి.

ఆర్థ్రైటిస్‌లో బాధ పడుతున్నవారు ఏ రకమైన వ్యాయామాలు చేయాలి? అన్న విషయాన్ని తమ వైద్యులతో చర్చించాలి. ఆర్థ్రైటిస్ పీడితులు చాలా వరకు ముందు సులభమైన, తక్కువ కదలిక ఉండే వ్యాయామాలు, తక్కువ ప్రభావం చూపే ఏరోబిక్స్‌తో ప్రారంభించాలి. వీరు చాలా క్రీడలలో పాల్గొనవచ్చు. కానీ అన్ని క్రీడలు, వ్యాయామ కార్యక్రమాలు వీరికి అనువైనవి కావు. ఇంటిలోనే చేయగలిగే వ్యాయామ పద్ధతిని ముందుగా రూపొందించి ఫిజియో థెరపిస్టు రోగికి బోధిస్తారు.

చికిత్స

విశ్రాంతి, రిలాక్సేషన్, సరైన ఆహారం, ఔషధం, కీళ్ళను సరైన విధంగా వినియోగించేందుకు సూచనలు, నొప్పిని నియంత్రించే పద్ధతులు వంటివి చికిత్సలో అంతర్భాగాలు. ఆర్థ్రైటిస్ నొప్పులను నివారించేందుకు వేడినీటిలో ముంచిన టవల్, హాట్‌పేక్, స్నానం వంటి వాటి ద్వారా లభించే వెచ్చదనం రోజుకు మూడుసార్లు 15-20 నిముషాలపాటు ప్రభావిత ప్రాంతానికి అందితే వ్యాధి లక్షణాలు తగ్గుతాయి. వాపులేని కీళ్ళపై సుశిక్షిత నిపుణుడు షార్ట్‌వేవ్, మైక్రోవేవ్స్, అల్ట్రాసౌండ్ వంటి వాటిని వాడటం ద్వారా అంతర్గతంగా వేడిని కల్గించవచ్చు.



ఐస్ సంచికానీ, తువ్వాలులో మూట గట్టిన గడ్డకట్టిన కూరగాయలతో గాని 15-20 నిముషాలపాటు కాపడం వల్ల వాపు తగ్గి బాధ తగ్గుతుంది. ఈ పద్ధతిని బాగా వాచిన కీళ్ళకు వాడతారు. హైడ్రో థెరపీ (జల చికిత్స) కూడా బాధను తగ్గించి, స్టిఫ్‌నెస్‌ను తగ్గిస్తుంది. పెద్ద కొలనులో వ్యాయామం చెయ్యడం మంచిది. దీనివల్ల ప్రభావిత కీళ్ళపై ఒత్తిడిని, బరువును కొంత వరకు తగ్గిస్తుంది.

రిలాక్సేషన్ చికిత్స కూడా బాధను తగ్గిస్తుంది. నొప్పిని తగ్గించేందుకు కండరాలలో ఒత్తిడిని విడుదల



చేయడాన్ని రోగులు నేర్చుకోవచ్చు. ఫిజియోథెరపిస్ట్ ఈ పద్ధతులను బోధించే వీలుంది. హెల్త్ క్లబ్‌లు, విశ్రాంతి విడిదులలో రిలాక్సేషన్ పద్ధతులను బోధిస్తున్నారు.

ఆక్యుపంక్చర్ అనేది చైనీయుల నొప్పి నివారణ ప్రక్రియ. ఈ పద్ధతిలో సుశిక్షితులైన నిపుణులు సూదులను నియమిత ప్రదేశాలలో ఉంచడం ద్వారా చికిత్స అందిస్తారు. లోతట్టున ఉన్న నరాలను సూదుల ద్వారా చైతన్య పరచడం ద్వారా సహజ నొప్పి నివారిణిని విడుదల చేయవలసిందిగా మెదడుకు ఈ ప్రక్రియలో సంకేతాలు అందుతాయని నిపుణుల భావన. 'ఆక్యుప్రెషర్' కూడా ఈ మాదిరి ప్రక్రియే. సూదుల బదులు అదే ప్రాంతాలలో ఒత్తిడిని కల్గించడమే రెంటికీ ఉన్న తేడా.

వ్యాయామం వల్ల నొప్పి కలిగి, గంటకంటే ఎక్కువ సమయం ఉంటే అది అధిక అలసటను కల్గించేదిగా గుర్తించాలని నిపుణులు అంటున్నారు. ఆర్థ్రైటిస్ రోగులు వ్యాయామం చేసే సమయంలో అధిక అలసట, ఎక్కువ బలహీనత, అధిక కీళ్ళ వాపు, తగ్గని నొప్పి వంటివి గమనిస్తే తమ వైద్యునితో సంప్రదించి అందుకు అనుగుణంగా వ్యాయామ సరళిని మార్చుకోవాలి.

కండరాలను బలపరచడం ద్వారా కీలుపై ఉండే ఒత్తిడిని తగ్గించి నొప్పిని తగ్గించవచ్చు. చిన్నచిన్న బరువులూ, ఐసోమెటిక్స్, ఇలాస్టిక్ బేండ్స్, రెసిస్టివ్ వాటర్ ఎక్సర్‌సైజ్ వంటి వాటి ద్వారా కండరాలను పటిష్ట పరచవచ్చు. సరైన భంగిమ అత్యంత కీలకమైనది. తప్పుగా దీన్ని చేస్తే కండరాలను పటిష్టపరిచే వ్యాయామాలే కండరాలను విచ్ఛిన్నం చేస్తాయి. దీనివల్ల తీవ్రమైన నొప్పి, మరింత వాపు ఏర్పడతాయి.



నియమిత ఆర్థ్రైటిస్ వ్యాధికి సంబంధించి, రోగికి సహాయపడే వ్యాయామాలను వైద్యులు, ఫిజియోథెరపిస్ట్, ఆయా అంశాలలో నిపుణులు మాత్రమే సిఫారసు చేయగలరు. బాధించే కీళ్ళకు అవసరమైన ప్రత్యేక వ్యాయామాలను వైద్యులు సిఫారసు చేస్తారు. వ్యాధి పీడితులు తమ వ్యాయామ పద్ధతులను తమ వైద్యులతోనే సంప్రదించడం మంచిది. ★

'పారాహుషార్' బాగుంది



పారా హుషార్... శేఖర్ కార్టూన్లు

వెల : రు. 50/-, ప్రతులకు : ప్రజాశక్తి, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు, దిశ పుస్తక కేంద్రం, హైదరాబాద్

ఒక సుదీర్ఘ ప్రసంగం ద్వారా లేదా ఒక సంపాదకీయం ద్వారా చెప్పాల్సిన విషయం చిన్న కార్టూన్ ద్వారా చెప్పొచ్చు. కార్టూన్లు నవ్విస్తూ, ఆలోచింపచేస్తూ, చురకలు అంటిస్తూ ఉంటాయి. సమాజంలో చాలా సమస్యలు ఉన్నాయి. వాటిపై కార్టూనిస్టులు నిరంతరం యుద్ధం చేస్తూనే వుంటారు. అందులో చెప్పుకోదగ్గ వ్యక్తుల్లో చంద్ర శేఖర్ ఒకరని చెప్పొచ్చు. ఆయన వేసిన కార్టూన్లు అన్నీ నవ్వించకపోయినా అలోచింపచేస్తాయి. కొన్ని కడుపుబ్బనవ్విస్తాయి. ఆయన మొట్టమొదటిగా కార్టూన్ రంగంలో అక్షరాలు దిద్దింది ప్రజాశక్తిలో. ఆ దశలోనే ఆయన ఏ వైపు ఉండాలో అక్కడే నిర్ణయించుకున్నారు. సమస్యల పట్ల ఆయన స్పందన చాలా పదునుగా ఉంటుంది. అందరితో సన్నిహితంగా వుండడం వల్ల ఎన్నో సూచనలు, సలహాలు వచ్చేవి. ఎడిటర్ దగ్గర్నుంచి ఆఫీసు బాయ్ దాకా ఎవరు ఏ సలహా ఇచ్చినా స్వీకరించేవారు. అక్కడ అలవర్చుకొన్న అభ్యుదయ భావాల్ని తరువాత కూడా కొనసాగించడం అభినందనీయం.

సమాజాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాదం, అవినీతి, నిరుద్యోగం, ఆకలి, కులపీడన, పేదరికం ఇలా చాలా సమస్యలపై తనదైన శైలిలో పెద్ద సంఖ్యలో కార్టూన్లు వేసి ప్రజల మన్ననలు పొందారు. గ్లోబలైజేషన్ వల్ల సామాన్య మానవుడు పడే ఇబ్బందులు, భారత్‌ను విదేశీ సంస్థలు దోచుకునే తీరు, మన ప్రభుత్వాల చేతగానితనంపై చాలా చక్కగా కార్టూన్లు గీశారు. తినడానికి తిండిలేక ప్రజలు అన్నమోరామచంద్ర అంటుంటే కంప్యూటర్లు, సీడీలు, కార్లు ముందర పెట్టుకుని సామాన్య మానవుడు బాధపడుతున్న వైనం ఎంతగానో ఆలోచింపచేస్తుంది. సామెతలను ఆధారంగా చేసుకొని గీసిన కార్టూన్ల ప్రయోగం చాలా బాగుంది. శేఖర్ ఆలోచనలు నిత్యనూతనం అని చెప్పొచ్చు. ఒక్కొక్క కార్టూన్‌లో ఒక్కొక భావం, లోతైన ఆలోచన దాగివున్నది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న చీడపురుగులను ఏరిపారేయడానికి, సమాజ మార్పుకోసం నిరంతరం ప్రయత్నిస్తూ అద్భుతమైన కార్టూన్‌లు మనకు అందిస్తున్నారు. అభివృద్ధి వైపు దూసుకుపోతున్నాం. స్వర్ణాంధ్ర సాధిస్తాం అని ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్న చంద్రబాబు గారు, స్వర్ణాంధ్రప్రదేశ్‌లో రైతుల ఆత్మహత్యలగురించి ఏమంటారోమరి అని గుర్తుచేశారు. అప్పులుతెచ్చి విద్యుత్ భారాలు మోపితే సగటు మనిషిపై ఎంత ప్రభావాన్ని చూపుతున్నాయో రైతు విద్యుత్ స్థంభాన్ని శిలువగా మోస్తున్న కార్టూన్ చూస్తే ఇట్టే అర్థమౌతుంది. సామ్రాజ్యవాదం పైనే కాకుండా కులం, మతం, దోపిడి, అవినీతి ఇలా అన్ని సమస్యలపై మంచి కార్టూన్లు వేశారు. ప్రజలకు సేవచేయడానికి రాజకీయాల్లోకి రాలేదు. పదవులకోసం వచ్చారు. పదవుల కోసం నాయకులు పార్టీలు మారుతున్నారు అని చెప్పారు. ఒక నాయకుడు వేరే పార్టీలో చేరడానికి వచ్చి ' ఏంటీ నాకు టిక్కెటివ్వడానికి ఒప్పుకున్నారా అయితే వచ్చేస్తున్నా' అని తిరిగి వెళ్లేందుకు సిద్ధంకావడం. ఒక నాయకుడు జైల్లో వుంటాడు. కాపలాగా వున్న పోలీసు ఇలా అంటాడు 'సౌకర్యాలు లేవని ఇప్పుడు గొణిగితే ఏం ప్రయోజనం? మంత్రిగా వున్నప్పుడు జైళ్లని పట్టించుకోండి అంటే విన్నారా?' అని చురక అంటిస్తూ నవ్విస్తాడు. అలాగే పదప్రయోగం చాలా బాగుంది. జైలు ప్రసాద్ యాదవ్, అబ్దుల్ మిసైల్ కలాం, అయ్యో బిహారి వాజ్‌పేయి, ఎన్‌డిఏ వెనకయ్య నాయుడు, నందమూరి తారక మామారావు అని ఇలా చాల పేర్లను గమ్మత్తుగా, అర్థవంతంగా మలిచాడు. ఒక పెద్ద కార్టూన్ చిన్న కార్టూన్ అలాగే మినీ కార్టూన్ పెట్టి ఆకర్షించే విధంగా పుస్తకాన్ని మలిచారు. విత్‌అవుట్ క్యాప్షన్ కార్టూన్లు బాగున్నాయి.

తెలుగులో కార్టూనిస్టులకు, కార్టూన్ రంగానికి తగిన అవకాశాలు లేవని దానివల్ల ఆ వృత్తిని వదిలేసి వేరే పనులు చూసుకుంటున్న సందర్భంలో పారాహుషార్ అంటూ ఈ బుక్ తీసుకురావడం అభినందించదగ్గ విషయం. కావాలనే కార్టూన్ రంగాన్ని ఎంచుకుని అందులో ఎంతగానో రాణిస్తూ వస్తున్నారు.

- జె.వెంకటేష్

స్వీకారం



ముద్దులొలికే మీ పిల్లలకు ముచ్చటైన పేర్లు

రచన:శ్రీమతి డి.విజయరావు; వెల:రు.25/-, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; డి.విజయరావు, ఫ్లాట్ నెం.302, వజీర్ అపార్ట్‌మెంట్స్, 5-3-84/3, మోహన్ విల్లా, మలకుంట, హైదరాబాద్-12



అక్షర శిల్పులు

సంకలనం : పి.ఎం.సుందరరావు; వెల:రు.25/-, ప్రతులకు ; పి.ఎం.సుందరరావు, 47-3-6, లూర్దునగర్, గుణదల, విజయవాడ-4; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;



తరంగం

సంపాదకత్వం : డా॥ టి.రంగస్వామి; వెల:రు.60/-, ప్రతులకు : శ్రీలేఖసాహితి, హెచ్.నెం.14-5/2, ఎమ్.ఆర్.ఓ. ఆఫీస్ ఎదురుగా, హసన్‌పర్తి, వరంగల్; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;



మనశ్శాంతి మార్గం

శాంతిసాధన మెట్లు

రచన-సంకలనం : లయన్ డా॥ వేదుల శ్రీరామశర్మ (శిరీష); వెల:రు.12/-, ప్రతులకు : లయన్ డా॥ వేదుల శ్రీరామశర్మ (శిరీష), 66-5-20, అశోక్‌నగర్, కాకినాడ; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు;

వన్యమృగాలు, పక్షుల నెలవు

శేషు

ఆంధ్రప్రదేశ్ అరుదైన వన్య మృగాలు, పక్షి జాతులు, వృక్ష జాతులకు నెలవు. దట్టమైన దండ కారణ్యం, నల్లమల అడవులు, కొల్లేరు, పులికాట్ సరస్సులు, సముద్రతీరాలు, అనేక జంతు ప్రదర్శనశాలలు రాష్ట్రంలో ఉన్నాయి. ఇవన్నీ పర్యాటక ప్రదేశాలే. అంతేగాకుండా రాష్ట్ర పర్యాటకశాఖ ఎకో టూరిజం పేరిట అటవీప్రాంతాల్లో పర్యాటకులకు సదుపాయాలు కల్పిస్తూ ప్రకృతి అందాలు తిలకించడానికి అవకాశం కల్పిస్తోంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖ, తిరుపతి కేంద్రాలుగా ఈ పర్యాటక ప్రాంతాలకు వెళ్ళడానికి అవకాశం ఉంది.



కృష్ణానది కిరువైపులా దట్టమైన నల్లమల అడవుల్లో 3568 చదరపు కిలోమీటర్ల పరిధిలో నాగార్జునసాగర్, శ్రీశైలం వన్యమృగ సంరక్షణ కేంద్రం విస్తరించి ఉంది. ఇక్కడి పులుల సంరక్షణకేంద్రం దేశంలోనే పేరుగాంచింది. పులులతో పాటు చిరుతలు, నక్కలు, తోడేళ్ళు, జింకలు, నెమళ్ళు తదితర అనేక రకాల అడవి జంతువులు, పక్షులు ఈ అడవిలో నివసిస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని అక్టోబర్-మే మాసాల మధ్య సందర్శించితే బాగుంటుంది. పర్యాటకుల కోసం హైదరాబాద్, శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో వసతిగృహాలున్నాయి.

హైదరాబాద్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో మెదక్ జిల్లాలో మంజీరా నదీతీరం వెంట విస్తరించి ఉన్న మంజీరా పక్షి సంరక్షణకేంద్రం పర్యాటకులను బాగా ఆకర్షిస్తోంది. ఇక్కడి మొసళ్ళు ప్రత్యేక ఆకర్షణ.

కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయవనం

హైదరాబాద్ నగరంలో జూబ్లీహిల్స్ వద్ద 142 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ పార్క్ నగరంలో మార్నింగ్‌వాక్ చేసేవారికి ఎంతో ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తుంది. నక్కలు, ముంగీసలు తదితర జంతువులతో పాటు వంద జాతుల పక్షులు, 20 జాతుల సరీసృపాలు, 15 జాతుల అరుదైన సీతాకోకచిలుకలు ఈ పార్క్‌లో ఉన్నాయి. అంతేగాకుండా ఎన్నో అరుదైన పుష్పజాతులు ఇక్కడ కనిపిస్తాయి. ఏడాది పొడవునా ఈ పార్క్‌ను సందర్శించవచ్చు.

మహావీర్ హరిణి వనస్థలి జాతీయవనం

నిజాం నవాబు వేటకు ఉపయోగించిన ఈ పార్క్ హైదరాబాద్ నగరానికి 30 కిలోమీటర్ల దూరంలో ఉంది. 14 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న ఈ అడవి ప్రస్తుతం జనారణ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో జంతువులకు ఆశ్రయం కల్పిస్తోంది. పొడిబారిన గడ్డినేలల ఈ అడవిలో పలురకాల జంతువులు, పక్షులు, సరీసృపాలు సంరక్షించబడుతున్నాయి. ఏడాది పొడవునా దీనిని సందర్శించవచ్చు.

ఆదిలాబాద్ జిల్లాలో కాల్వాల్, ప్రాణహిత, శివరాం, వరంగల్ జిల్లాలోని ఏటూరు నాగారం, పాకాల జంతు, పక్షి సంరక్షణ కేంద్రాలు పర్యాటకులకు ఎంతో ఆహ్లాదాన్నిస్తాయి.

కొల్లేరు

673 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న సహజసిద్ధమైన మంచినీటి సరస్సు కొల్లేరు. ఇక్కడికి రష్యా వంటి దూర దేశాల నుండి ప్రతిఏటా కొంగలు, పెలికాన్, ఫ్లెమింగో వంటి అరుదైన పక్షులు వలస వస్తాయి. కొల్లేరులో పడవ ప్రయాణం ఎంతో మనోహరంగా ఉంటుంది.

పాపికొండలు

గోదావరి తీరాన దట్టమైన దండకారణ్యంలో గల పాపికొండల చుట్టూ 591 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పరుచుకున్న ఈ ప్రాంతంలో ప్రకృతి పర్యాటకులకు మంచి అనుభూతినిస్తుంది. రాజమండ్రి -భద్రాచలం మధ్య గోదావరిలో పడవ ప్రయాణం మరచిపోలేనిది. ఇక్కడ ఎన్నో రకాల జాతులు మృగాలు, పక్షులు, సరీసృపాలు, అందమైన జలపాతాలు ఉంటాయి. గోదావరి తీరానే కోరింగ, కిన్నెరసాని వన్యమృగ సంరక్షణ కేంద్రాలు కూడా ఉన్నాయి.

పులికాట్, నేలపట్టు

500 చదరపు కిలోమీటర్ల పరిధిలో బంగాళాఖాతం బ్యాక్‌వాటర్స్‌లో విస్తరించి ఉన్న ఉప్పునీటి సరస్సు పులికాట్ ఎన్నో రకాల పక్షులకు ఆటపట్టుగా ఉంది. అదేవిధంగా నెల్లూరు జిల్లాలోనే నేలపట్టు ప్రదేశంలో 4 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మంచినీటి సరస్సు కూడా అనేక పక్షులకు ఆలవాలంగా ఉంది. అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో కూడా అడవులు విస్తరించి ఉన్నాయి. ★



విలక్షణ 'ఊహాత్మక' చిత్రకారుడు బొమ్మల శ్రీను





వివిధ గులకరాళ్ళపై చింపాంజీల
మాతృప్రేమ, ఒంటెతల, డైనోసార్
తల, మేకతల, శివంగి

చలపాక ప్రకాష్

అతని పేరు రాజులపాటి శ్రీనివాస్. కాని 'బొమ్మల' శ్రీను అంటేనే ఆ ఊరిలోని వారికి అర్థమవుతుంది. అందుకు కారణం, అతని చిరుప్రాయంలోనే ఏకలవ్య శిష్యుడిగా బొమ్మలు వేయటమే ప్రవృత్తిగా పెట్టుకొని ఈనాడు చిత్రకళనే వృత్తిగా స్వీకరించి జీవనం సాగిస్తున్న (వి)చిత్రకారుడతను. అందరూ వేసే చిత్రాలకు భిన్నంగా, ఇంతక్రితం వరకూ ఎవరూ గీయని ఊహాత్మక చిత్రాలు గీయటమే ఈయనలో దాగి వున్న ప్రత్యేక 'ప్రతిభ'కు నిదర్శనంగా పేర్కొనవచ్చు. మరి ఈయన 'ప్రతిభ' వెనుక దాగి వున్న కృషి గురించి ఈ వారం కళాసాహితిలో తెలుసుకుందాం.

ఆగస్టు 26, 1974 సంవత్సరంలో రాజులపాటి వెంకటేశ్వరావు, నాంచారమ్మ దంపతులకు జన్మించిన శ్రీనివాస్‌కు చిరుప్రాయంలోనే అంటే నాలుగేళ్ళ వయస్సులోనే మట్టిబొమ్మలు చేయడమంటే ఎంతో ఇష్టం. 'చదువుకోరా అంటే ఆ మట్టితో బొమ్మలు చేయడమేమిట్రా' అని తల్లిదండ్రులు మందలించినా మట్టిని పిసికిన ఆ చేతులు ఆ మట్టికి అందమైన ఆకృతితో జీవం పోసే స్థాయికి ఎదిగి రాష్ట్ర స్థాయిలోనే తృతీయ బహుమతిని అందుకోవటంతో తుదకు శ్రీనివాస్ ప్రతిభను మెచ్చుకోవడం ఆ తల్లిదండ్రులకే కాదు ఆ స్కూలు ఉపాధ్యాయుల వంతూ అయ్యింది. మట్టితో చిగురించిన ఇతనిలో కళాశక్తి ఇతని సోదరి ప్రోత్సాహంతో కాగితాలపై బొమ్మలు గీసే స్థాయికి ఎదిగింది. అయితే అందరు చిత్రకారులలాగా బొమ్మను చూసి బొమ్మలు వేయటానికి భిన్నంగా, మనసులో ఊహించుకున్న,

రూ పా యి

రూపాయికి
ఇప్పుడు
రెండు ముఖాలు మనిషే
మనిషి జాడలు రూపాయి
మనిషి ఉనికి రూపాయి
మనిషిని మనిషి రాసుకుంటే
రూపాయే రాలుతుంది

రూపాయి సర్వాంతర్యామి
పట్టు పరుపు
పక్కలో బల్లెం
మనిషి అంతర్వాహిని
రూపాయి 'ఎస్కార్ట్' సింబల్

మనిషికి రూపాయి రోగం బట్టింది
మనిషిని గావెర బెట్టి గెదుముతంది
సిలైన్లు గాదు!
రక్తం గాదు!!
రూపాయి నెక్కించండ్రీ!!!

- జీగురు అయిలయ్య

అంతక్రితం వరకూ ఎవరూ వెయ్యని ఊహాత్మక చిత్రాన్ని రూపొందించటం శ్రీనివాస్‌లో దాగి వున్న ప్రత్యేక లక్షణంగా, ప్రతిభగా పేర్కొనవచ్చు. శ్రీనుగీసిన బొమ్మలు మోడరన్ ఆర్ట్‌ని పోలి వుంటాయి గాని అర్థం కాకుండా మాత్రం వుండవు. చిత్రంలోని భావం అంతర్గతమై వుండి తరచిచూసే కొలది మనస్సు పులకించిపోతుంది. అందులోని భావం బాధనో, కష్టాన్నో, నష్టాన్నో చూపించి ఆలోచింప చేస్తుంది. సామాజిక సమస్యలపై శ్రీను గీసిన చిత్రాలలో సారా రక్కసి కోరల్లో యువత, ఈనాటి కరువు పరిస్థితి, రైతుల ఆత్మహత్యలు, నీటి కరువు ఇతరత్రా చిత్రాల ద్వారా బహిర్గత పర్చబడి వర్తమాన పరిస్థితులను ప్రజలకు ఏకరువు పెట్టబడ్డాయి. భారత లౌకిక, ప్రజాస్వామిక వ్యవస్థలో శాంతి అనే పావురం కులమతాలనే పాముల విషపు కౌగిలిలో ఎలా విలవిలలాడుతూ నెత్తురు కక్కుతుందో కళ్ళకు కట్టినట్లు చిత్రించి వీక్షకులను అబ్బురపరిచారు శ్రీనివాస్. అంతేకాక కొన్ని సభలలో ప్రత్యక్షంగా కాన్వాస్‌పై ప్రేక్షకులు చేసిన సంతకాలకు అప్పటికప్పుడు వారి కంటి ఎదురుగానే ప్రతి సంతకానికి ఒక సందర్భోచితమైన చిత్రాన్ని చిత్రించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నాడు శ్రీనివాస్. కృష్ణా జిల్లా బంటుమిల్లికి చెందిన ఈ యువ చిత్రకారుడు తాను గీసిన అనేక చిత్రాలకు రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలోనే అనేక అవార్డులు అందుకున్నారు. మరిన్ని సంస్థలచే సత్కారాలను పొందారు. 1992 నుంచి నాలుగు రాష్ట్ర అవార్డులు, 12 జాతీయ అవార్డులు, 3 పతకాలు, 2 రజిత పతకాలు సాధించారు. శ్రీనివాస్‌కు కేవలం చిత్రకళలోనే కాకుండా మైక్రోఆర్ట్, మిమిక్రీ కళలో కూడా ప్రావీణ్యత వుంది. కేవలం 30 రోజుల వ్యవధిలో 750 మైక్రో చిత్రాలను గీసి రికార్డు సృష్టించారు. చింపాంజీల మాతృప్రేమ, ఒంటె తల, డైనోసార్ తల, మేక తల, శివంగి తల్లి బిడ్డకు స్నానం చేయిస్తున్నట్టు వంటి చిత్రాలను వివిధ గుళకరాళ్ళపై చిత్రించారు. లక్ష్మీబాయ్, లాల్‌బహదూర్ శాస్త్రి, సుభాష్ చంద్రబోస్ వంటి జాతీయ నాయకుల చిత్రాలను నిమ్మగింజపై చిత్రీకరించారు. ఇంకా చిక్కుడుగింజలు, పొట్లగింజలు, బీరగింజలతో పాటు చివరికి ఆవగింజపై కూడా అద్భుతంగా బొమ్మలు చిత్రీకరించాడు. సిరామిక్ పౌడర్‌తో మూడు అంగుళాల వీణను తయారు చేయడమే కాకుండా దీనికి మూడు తలవెంట్రుకలను తీగలుగా తీర్చిదిద్దిన శ్రీను సృజనాత్మక చిత్రకారుడే కాదు విలక్షణ చిత్రకారుడు కూడా. చీరలపై, పెళ్ళిళ్ళలో (అడ్డుగుడ్డ), బ్యానర్‌లపై విలక్షణ చిత్రాలు గీయగలడు. పేపర్ కటింగ్స్‌తో మంచి డిజైన్‌లు, బొమ్మలు చేయగలడు. కేరట్ వంటి దుంపలను చెక్కి శిల్పాలుగా మలచగలడు. చాక్‌పీస్‌లతో కళామూర్తులను తీర్చిదిద్దగలడు. ఇన్ని విధాలుగా ప్రత్యేక ప్రతిభను కనబరుస్తున్న బొమ్మల శ్రీనుకు గురువంటూ ఎవరూ లేకపోవడం విచిత్రం. ఆయన సాధించిన అపూర్వమైన కృషికి, పట్టుదలకు నిదర్శనం. ఏకలవ్యుడి దీక్షను, కష్టించి పని చేయటంలోని ఆనందాన్ని ఒంటపట్టించుకున్న బొమ్మల శ్రీను గిన్నీస్‌బుక్‌లోకి ఎక్కడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. తాను చిత్రకారుడిగా ఈ స్థాయికి ఎదగటానికి కారణం తన చెల్లెలు, తల్లిదండ్రుల ప్రోత్సాహమే కారణమని చెప్పుకునే బొమ్మల శ్రీను నుండి మరిన్ని ఆలోచనాత్మక చిత్రాలు వెలువడి సమాజాన్ని చైతన్యపరిచే దిశగా సాగాలని ఆశిద్దాం. ★

నేటి కరువు ఊహాచిత్రం



మార్పుకు తీర్పు

మార్పుకు దృష్టాంతం...
సూర్యుడు నడిరాత్రి ఉదయించటం కాదు
కృష్ణశుక్ల పక్షాలు తలకిందులవటం కాదు
భూమి బల్లపరుపై భ్రమణం మారటం కాదు
మార్చి స్థానంలో మే అధిష్టించి ఏలటం కాదు
మార్పును గూర్చి మాట్లాడుకుందాం...
రోజుకు ఇరవై నాలుగు గంటలు
ముప్పై రోజుల్లో నెల ప్రయాణం
మధ్యల ఫిబ్రవరి ఇరవై ఎనిమిదికి కుదింపు
క్రమం తప్పని కాలగమనం!
నిద్రసుఖమెరుగక
కటిక నేలపై నిద్రించిన నువ్వు
పందిరి మంచంపై నిద్రలేస్తావు
చలికి వొంటిని అంకితం చేసిన నీకు
రగ్గు ఆచ్ఛాదనమై మేల్కొల్పు పాడుతుంది
దోపిడీని అరికట్టి
ఉద్యమం ఇచ్చిన మార్పు!
వేసిన అడుగు వేసినట్టే వుండి
నడక సాగని ప్రయాణం
అనేకమందికి అడుగుజాడై
జనావళికి మహాపథమై సాగుతుంది
ముడిరాయిని మలచటంలోను
ప్రాణం పొయ్యటంలోను
కృషి తెచ్చిన మార్పు!
పెట్టిన ఎసరుకు పొయ్యిమండక
మండిన ఎసరు అన్నం వండక
నడవలేని కథ నడిచి
కుండ నిండుగా వంట పడుతుంది
అక్రమాలపై గురి నిల్పి
పోరు సల్పిన మార్పు!
అంతవరకు పగిలిన చెంపలు
పగలేసిన చేతుల్ని పట్టుకుంటాయి
నిలేసి ప్రశ్నిస్తాయి
ముద్దాయిల్ని బంధిస్తాయి
గడియారం లోలకంలోను
సూర్యుడి గమనంలోను మార్పుండదు
కాలాన్ని మానవ కళ్యాణానికి
మనోజ్ఞంగా మలచటమే మార్పు!

- అడిగోపుల వెంకటరత్నమ్

ADVOCATE

న్యాయసలహాలు

- జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

నాకు న్యాయం చేయండి

మా నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి. నాన్నగారి సంపాదన మీదే మా కుటుంబం నడిచేది. నేను, నాన్న, అమ్మ, తమ్ముడు. ఇదే మా కుటుంబం. ఏడు సంవత్సరాల క్రితం నాన్నగారు చనిపోయారు. నాన్నగారికి వచ్చిన లక్ష రూపాయలు అమ్మ దగ్గర ఉంచుకుంది. తమ్ముడికి నాన్న ఉద్యోగం ఇప్పించారు. నేను మాత్రం కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నాను. ఇప్పటివరకు అమ్మ నాకు రు.25,000లు ఇచ్చింది. పెద్దవాళ్ళ ఉద్యోగం ఒకరికి, డబ్బు ఒకరికి అంటారు కదా కాని నా విషయంలో అలా జరగలేదు. అమ్మ రు.50,000లకు ఒక ఇంటిని కుదువ పెట్టుకుంది. వాడు డబ్బులు ఇవ్వనందున మా డబ్బు కింద అతని వాటాకు వచ్చే ఇంటిని మేము వాడుకుంటున్నాము. అమ్మ ఆ వాటాలోనే వుంటోంది ఇపుడు. నేను, అమ్మ, తమ్ముడు వేర్వేరుగా ఉంటున్నాము. తమ్ముడు ఉద్యోగం చేస్తూ, హాయిగా బతుకుతున్నాడు. అమ్మ పించన్‌తో బ్రతికేస్తోంది. చివరికి నేను అనాథలా మారాను. నాకు న్యాయం జరిగేదెలా? నేను ఎవరిని సంప్రదించాలి. కూలి పని చేస్తూ జీవనం సాగించడం కష్టంగా వుంది. మీ జవాబు కోసం ఎదురు చూస్తూ.

- బి.రాజేష్, ఖమ్మం

రాజేష్‌గారు మీ నాన్నగారి ఉద్యోగం మీ తమ్ముడికి ఇప్పించేటప్పుడు పెద్ద వారైన మీరు ఆ ఉద్యోగం కొరకు ప్రాముఖ్యత ఇచ్చినట్లు లేదు. పెద్ద వారైన మిమ్మల్ని కాదని మీ తమ్ముడికి ఉద్యోగం రావడం చూస్తుంటే సదరు ఉద్యోగానికై మీకు సరిపడ అర్హత లేనట్లుగా అనిపిస్తోంది. అందువల్లనే అర్హత వున్న వారసుడిగా ఉద్యోగం మీ తమ్ముడికి లభించి వుంటుంది. మీరు మీ విద్యార్హతలు, ఉద్యోగార్హతలు మీ జాబునందు పొందుపరచలేదు. మీ నాన్నగారి మరణం ద్వారా మీ అమ్మగారికి వచ్చిన లక్ష రూపాయలు, సదరు తేదీ నాటికి మీరు మేజర్ అయితే మీకు ఎటువంటి హక్కు ఆ పైకంపై లేదు. పూర్తిగా మీ అమ్మగారే హక్కుదారు. మీ తండ్రిగారి ఉద్యోగాన్ని కేటాయించినప్పుడు అన్ని అర్హతలు కల తమ్ముడికి ఉద్యోగమును, మీకు రు.25,000 మీ అమ్మగారు విభజించినట్లు మీరు చెప్పారు. ఆవిడ ఇష్ట ప్రకారం మీకు ఏమైనా ఇవ్వదలచుకుంటే పొందవచ్చు.

అప్పుల వారి నుండి రక్షణ కల్పించండి

నేను అటెండర్‌గా పని చేయుచున్నాను. 2000 సంవత్సరంలో మా నాన్నగారికి కాన్సర్ జబ్బు వచ్చినప్పుడు నూటికి పది రూపాయలు చొప్పున రు.50,000లు, నూటికి ఐదు రూపాయలు చొప్పున 50,000 రూపాయలు అప్పుగా తీసుకున్నాను. ప్రామిసరీ నోటుపై నూటికి రెండు రూపాయలు వడ్డీ చొప్పున నాతో రాయించుకున్నారు. కాని నా తండ్రిని బతికించుకునే నిమిత్తం నేను ఆ టైమ్‌లో అప్పు చేశాను. ఆ దినములో నాకు కేవలం రు.3500లు జీతం అందేది. నేను కట్టవలసిన వడ్డీలు నెలకు రు.7,500లు అందుచేత వారితో మాట కాస్తానని భయంతో ప్రతీనెలా వడ్డీలకు వడ్డీలు కట్టడం వలన లక్ష రూపాయలు ఉన్న అప్పు నేటికి సుమారు మూడు లక్షల యాభై వేల రూపాయలు అయ్యింది. వడ్డీలు కట్టలేక నా కుటుంబం పోషించలేకా ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తుంది. నెలకు తొలుత రు.7,500లు వడ్డీ అన్నది ప్రతీ నెల అందరి వద్ద వాడినందుకు నెలకు సుమారు 20,000 వడ్డీలు కట్టుచున్నాను. నేను బతకాలంటే నాకు తమరు ఉచిత న్యాయసలహా ఇవ్వగలరని ప్రార్థిస్తున్నాను.

- ఎస్.రాములు, అటెండర్, పార్వతీపురం.

మీరు చెప్పినట్లు నెలకు రు.10/-, రు.15/- వడ్డీరేట్లు చట్ట ప్రకారం చెల్లనవి తరువాత మీరు ప్రాంసరీ నోటు నందు రు.2/- వడ్డీ చూపిస్తూ సంతకాలు చేశామన్నారు. కాని ఆ ప్రాంసరీ నోట్లపై మీరు తీసుకున్న అసలు మొత్తం రు.50,000గా రాసి వున్నారా? మీరు ప్రతినెలా వడ్డీ చెల్లించుతున్నామన్నారు. అట్టి చెల్లింపులకు రశీదు కాని లేదా నోటు వెనకగాని డబ్బులకు (ఎండార్స్‌మెంట్) జమ ఉన్నదా ? లేదా? మీరు పై మొత్తం 2000 సంవత్సరంలో తీసుకున్నామన్నారు. సదరు ప్రాంసరీ లేనట్లయితే మీరు నోటు రాసిన నాటి నుండి నేటికి 3 సంవత్సరాలు నిండి ఉన్నట్లయితే మీకు అప్పు ఇచ్చిన వారు ఎటువంటి నోటీస్ ఇవ్వలేదు కనుక మూడు సంవత్సరాలు నిండిపోయినవి కనుక పై రెండు ప్రాంసరీ నోట్లు చట్టప్రకారం చెల్లనేరవు. కావున మీరు ఆ వ్యక్తులకు ఎటువంటి బకాయిలు లేనట్లే. వారు కోర్టుకెళ్లినా అట్టినోట్లు చెల్లవు.

రుచి

కొబ్బరి పూర్ణాలు

కావలసిన వస్తువులు:

కొబ్బరి కాయ	:	ఒకటి
మైదా	:	పావు కిలో
నూనె	:	అర కిలో
బెల్లం	:	పావు కిలో
ఏలకులు	:	ఐదు

తయారుచేసే విధానం:

కొబ్బరికాయ కొట్టి తురుముకోవాలి. బెల్లం కూడా తురమాలి. ఇవి రెండూ కలిపి పొయ్యి మీద వేడి చేయాలి. ఇది ముద్దలాగ అవుతుంది. దీనిలో ఏలకుల పొడి వేసి కలపాలి. చిన్నచిన్న ముద్దలుగా చేసి పెట్టుకోవాలి. మైదా పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. దానిలో నీళ్ళుపోసి అట్లపిండి కన్నా గట్టిగా కలుపుకోవాలి. పొయ్యిమీద బాండీ పెట్టి నూనె పోసి కాగనివ్వాలి. పూర్ణం ముద్దను మైదాలో ముంచి నూనెలో వేయాలి. వేగినాక తీసివేయాలి. ఇవి చాలా రుచిగా ఉంటాయి. ఇది చాలా బలవర్ధకమైన ఆహారం.

మైదా పిండితో పాల బూరెలు

కావలసిన వస్తువులు:

మైదాపిండి	:	అర కిలో
పంచదార లేక బెల్లం	:	400 గ్రాములు
నూనె	:	అర కిలో
ఏలకులు	:	పది
పాలు	:	సరిపడా

తయారుచేసే విధానం:

మైదా పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. పాలల్లో పంచదార లేక బెల్లాన్ని నాననివ్వాలి. మైదాపిండిని కలపాలి. అట్లపిండి కన్నా గట్టిగా కలుపుకోవాలి. యాలకుల పొడి కూడా వేసి కలపాలి. రేపు ఉదయం బూరెలు చేసుకోవాలంటే ఈ రోజు సాయంత్రమే పిండి కలుపుకోవాలి. పొయ్యి మీద బాండీ పెట్టి నూనెపోసి కాగనివ్వాలి. నూనె కాగిన తరువాత చుక్కలు పడకుండా గరిటెతో ఈ పిండి పోయాలి. ఇవి బాగా ఎత్తుగా పొంగుతాయి. ఇవి మెత్తగా ఎంతో రుచిగా ఉంటాయి. లోపల పొరలు పొరలుగా వచ్చి చాలా బాగుంటాయి. ఇవి రెండు రోజులు నిల్వ ఉంటాయి.

కావలెను...

సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం తెలుసా మీకు?

ఉద్యోగ ప్రకటనలలోను, ఇంటర్వ్యూలలోను ఇలాంటి ప్రశ్న ఉండటం మీరు గమనించే ఉంటారు.

'Yes' అంటే ఆ ఉద్యోగం మీకే !

కావలసిన విద్యార్హతలు, అనుభవం ఉన్నప్పటికీ ఇంగ్లీషు మాట్లాడలేని ఒకే కారణంవల్ల మీకు వచ్చిన అవకాశాలు జారవిడవకండి.

మీ తీరిక వేళలో ప్రతిరోజు అరగంట సమయం కేటాయించి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ అందించే సులభమైన శిక్షణ ద్వారా సరళంగా ఇంగ్లీషులో మాట్లాడటం నేర్చుకోండి.

ఇప్పటికి 16 లక్షలకు పైబడినవారు ఈ శిక్షణ మూలంగా ప్రయోజనం పొందారు.

మీరు కూడా ఈ ప్రయోజనం పొందటానికి క్రింద ఉన్న కూపన్ పూర్తిచేసి ఈ రోజే పంపించండి. శిక్షణకు కావలిసిన పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్‌వద్ద **రూ. 575/-** చెల్లించి తీసుకోండి.

రోజూ అరగంట ప్రాక్టీసు చేయండి. తడబడకుండా ఇంగ్లీషులో మాట్లాడండి.

(044) 24347034
నెంబరుకు ఫోన్ చేస్తే చాలు
శిక్షణ పాఠాలు V.P.P. ద్వారా
ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి.

—ఇదిగో కూపన్—

నేను ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి **రూ. 575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

KPS

పేరు: ....

వయసు: .... ఆడ ☐ మగ ☐

చిరునామా: ....

....

.... పిన్‌కోడ్.........................

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T. Nagar, Chennai-600017.

08/TEL/04/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (S.R. NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. KUKATPALLY ☎ 55341431. VANASTHALIPURA ☎ 24122464. MEHDIPATNAM ☎ 55755888. A.S. RAO NAGAR ☎ 55497992. NARAYANAGUDA ☎ 55155441). RAJAMUNDRY ☎ 2422003. KAKINADA ☎ 2386638. VISAKHAPATNAM ☎ 2738892. VIJAYAWADA ☎ 5530053. GUNTUR ☎ 2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. KARIMNAGAR ☎ 2234883. WARANGAL ☎ 2578946. MIRYALGUDA ☎ 230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎ 248099. NIZAMABAD ☎ 235767. PRODDATUR ☎ 250550.